ఈనాడు
అనంతపురం
ఆదివారం ఆగస్టు 30, 2026

వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద కాలువకు గండి పడి వృథాగా పోతున్న నీరు

హంద్రీనీవా ప్రధాన కాలువకు గండి

విలువైన జలాలు వంకపాలు

ఈనాడు, అనంతపురం: న్యూస్‌టుడే, ఉరవకొండ: అనంతపురం జిల్లాకు ప్రాణాధారమైన హంద్రీనీవా ప్రధాన కాలువకు శనివారం తెల్లవారుజామున గండి పడింది. కాలువపై రాగులపాడు వద్ద ఉన్న పంపింగ్ కేంద్రంలోని 12 మోటార్లలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత సాంకేతిక సమస్యతో రెండు మోటార్లు ఆగిపోయాయి. దీంతో కాలువ ఎగువ భాగంలో ఒత్తిడి పెరిగి వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద కాలువ కోతకు గురై గండి పడింది. గట్టు తెగి నీరంతా వంక పాలవడంతో పాటు హోతూరు- గుంతకల్లు ప్రధాన రహదారిపైకి చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో కాలువలో 2800 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. విషయాన్ని ఉదయం గుర్తించిన అధికారులు కాలువలో ప్రవాహాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశంతో కర్నూలు జిల్లా మల్యాల పంపింగ్ కేంద్రంలో నీటి ఎత్తిపోతను తగ్గించడంతో మధ్యాహ్నానికి ప్రవాహం తగ్గింది. వెంటనే పొక్లెయినర్లతో గట్టుకు మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం కాలువలో 10 మోటార్ల పంపింగ్‌తో 2400 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ఆగిపోయిన రెండు మోటార్లకూ మరమ్మతులు చేపట్టారు. అనంతపురం జిల్లాలో తీవ్ర కరవు పరిస్థితుల నేపథ్యంలో సాగునీటికి కాదని, కేవలం తాగునీటి అవసరాలకే ఇస్తున్న కృష్ణా జలాలు ఇలా వృథా కావడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారిదే నిర్లక్ష్యం.. వారధే సాక్ష్యం

➤ అసంపూర్తిగా నిర్మాణాలు ➤ రాకపోకలకు జనం బెంబేలు

అనంతపురం(అశోక్‌నగర్), జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి ఛిద్రమై ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. మరికొన్నింటిపై ఏళ్ల తరబడి నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిపై వాహనదారులు నిత్యం ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వీడి నిధులు మంజూరు చేయించి, వంతెనలు పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈనేపథ్యంలో అనంత జిల్లాలో వంతెనల దుస్థితిపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.

జిల్లాలో వంతెనలు, కల్వర్టుల వివరాలు
- వంతెనలు: 19
- శిథిలావస్థలో ఉన్నవి: 7
- నిర్మాణాలు మంజూరు: 3
- ప్రతిపాదించినవి: 4
- కల్వర్టులు: 82
- అధ్వానంగా ఉన్నవి: 29
- మరమ్మతులకు నిధులు: రూ.6 కోట్లు

నాలుగేళ్లవుతున్నా.. పట్టించుకోరే

అనంతపురం నగరం.. రామచంద్రనగర్-బీపీ వనం మార్గం మధ్యలో సోమనాథనగర్ వద్దనున్న వంతెన ఇది. నాలుగేళ్ల కిందట వరదలకు దెబ్బ తింది. నిత్యం 50 వేల మందికిపైగా రాకపోకలు సాగిస్తుంటారు. రూ.కోటి వెచ్చిస్తే నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉన్నా.. ఆదిశగా చర్యలు శూన్యం. నిత్యం బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేసున్నారు.- **అనంతపురం (అశోక్‌నగర్)**

కూలుతున్నా.. కన్నెత్తి చూడరే

గుంతకల్లు నుంచి కసాపురం మీదుగా కర్నూలుకు వెళ్లే రోడ్డులో ఉంది ఈ వంతెన. హంద్రీనీవా జలాలు చెరువులకు వెళ్లడానికి రోడ్డు మధ్యలో పైపులు ఏర్పాటు చేసి గతంలో వంతెన నిర్మించారు. ప్రస్తుతం ఒకవైపు కొంతభాగం కూలిపోయింది. రక్షణ గోడలు లేవు. ఈ మార్గంలో వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు వ్యయం అవుతుందని అంచనా. - **న్యూస్‌టుడే, గుంతకల్లు**

పడిపోయి రెండేళ్లు.. కట్టేదెప్పుడు ఇంకెన్నాళ్లు?

బీకే సముద్రం మండలం కేకే అగ్రహారం నుంచి దుర్గం, ఏదావులపల్లి, దండువారిపల్లి, పూలకుంట తదితర గ్రామాలకు వెళ్లే రహదారిలో హెచ్చెల్సీ కాలువపై వంతెన కూలిపోయి రెండేళ్లు అవుతోంది. ప్రజలు, వాహనదారులు కాలువలో దిగి ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ.30 లక్షలు అవుతుందని అంచనా. - **న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం**

India's No.1
BEST FILTER COFFEE PARTNER
TRUSTED SINCE 1987
IS.612
JYOTHI
SUPER DELUX
CHICORY
Call : 98660 12915

1నే పింఛను పంపిణీ

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛను సొమ్మును సెప్టెంబరు 1న లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 2,76,328 మందికి రూ.123.686 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఉదయం 7గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి సొమ్ము అందజేయనున్నారు.

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

జేసీ విష్ణుచరణ్‌తో చర్చిస్తున్న ఎస్పీ జగదీశ్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ జగదీశ్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో బందోబస్తుకు వెళ్లే అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. పలు సూచనలు చేశారు. శిల్పారామం హెలిప్యాడ్ నుంచి బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కల్యాణ మండపం వరకు.. తిరిగి హెలిప్యాడ్ వరకు సీఎం ప్రయాణించే మార్గాల్లో ఎలాంటి భద్రతా లోపాలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీఐపీ భద్రత దృష్ట్యా ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ మళ్లింపు, రూట్ బందోబస్తు, హెలిప్యాడ్ భద్రతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ఆనంద్ సైతం ఇదే అంశంపై కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించి.. దిశా నిర్దేశం చేశారు.

197 పల్లెల్లో.. దాహం కేకలు

రెడ్‌జోన్‌లో 11 ఆవాస ప్రాంతాలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: తీవ్ర వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో దాహం కేకలు మిన్నంటాయి. వర్షాకాలంలోనూ 197 గ్రామాల్లో ప్రజలు గొంతు తడుపుకొనేందుకు అల్లాడాల్సి వస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే.. ముందు పరిస్థితి ఏమిటో అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుండగా- సాగునీటి సంగతి దేవుడెరుగు? అనుకుంటూ.. ముందుగా తాగునీటి కొరతను అధిగమించడంపై యంత్రాంగం దృష్టిసారించింది.

గ్రామాలవారీగా..
- తీవ్రం(రెడ్): 11
- మధ్యస్థం(ఎల్లో): 164
- తక్కువ(ఆరెంజ్): 22
- పర్వాలేదు(గ్రీన్): 829

1026 గ్రామాలు ఉంటే..

జిల్లాలోని 577 పంచాయతీల పరిధిలో 1026 గ్రామాలు ఉంటే.. 829 పల్లెల్లో తాగునీటి కొరత లేదని నిర్ధారించారు. మిగిలిన 197 చోట్ల ఏదో ఒక రూపంలో సమస్య ఏర్పడుతున్నట్లు గుర్తించారు. ఇందులోనూ 11 ఆవాస ప్రాంతాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

జిల్లాలో 4,277 చేతిపంపులు ఉంటే.. 4,269ల్లో నీరు లభిస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. వీటిని సచివాలయ ఉద్యోగులకు దత్తత ఇవ్వడంతో పాటు మరమ్మతులు, ఇతరత్రా అవసరాల కోసం రూ. 4.6 కోట్లు సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఆనంద్ చెబుతున్నా.. క్షేత్రంలో ఆ సన్నద్ధత కనిపించడం లేదనే మాట వినిపిస్తోంది.

- చేతిపంపులు: 4277
- భూగర్భ జలమట్టం: 15.66 మీటర్లలో

రాయదుర్గం శివారు కాలనీలో నీటి కష్టాలు ఇలా..

రాయదుర్గం ప్రాంతంలోనే..

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో.. రాయదుర్గం, శింగనమల, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో నీటి సమస్య అధికంగా ఉంది. రెడ్‌జోన్‌లో 11 పల్లెలు ఉంటే.. రాయదుర్గంలోనే ఏకంగా పది ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గుమ్మఘట్టలో 6, డి.హీరేహాళ్, కణేకల్లులో రెండేసి, గుంతకల్లులో ఒకటి చొప్పున ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

పాతాళంలో జలం

జిల్లాలో ప్రస్తుతం సగటు నీటిమట్టం 15.66 మీటర్లలో ఉండగా- గత ఏడాది ఇదే తేదీ నాటికి 10.84 మీటర్లలో ఉంది. ఇప్పుడు ఎనిమిది మండలాల్లో పాతాళంలోకి వెళ్లింది. శెట్టూరులో 44.14, యాడికిలో 36.44, కళ్యాణదుర్గంలో 35.16, కుందుర్పిలో 28.11, పుట్లూరులో 26.97, కణేకల్లులో 20.52, డి.హీరేహాళ్‌లో 19.48, రాయదుర్గంలో 18.72 మీటర్లల్లో నీటిమట్టం ఉంది.

భవనములు అద్దెకు కావలెను

రాష్ట్రంలో పేరెన్నికగన్న విద్యాసంస్థ తమ కాలేజీలను నడుపుటకు అనుకూలంగా ఉన్న కట్టిన భవనములు **అనంతపురం** నందు క్రింద పేర్కొనబడిన పరిమాణంలో అద్దెకు కావలెను. బస్టాండ్ - బస్టాప్ పరిసర ప్రాంతాల్లోని భవనములకు ప్రాధాన్యత ఇవ్వబడును.
♦ భవన వైశాల్యము 20000 నుండి 30000 చ॥అ॥లు వుండాలి.
♦ కనీసము 25 గదులు కలిగి ఉండవలెను.
♦ ఒక్కొక్కగది విస్తీర్ణము కనీసము 400 చ॥అ॥ కలిగి ఉండవలెను.
భవనములు సిద్ధంగా వున్నా, లేదా కట్టించి ఇచ్చుటకు ఆసక్తి వున్న యజమానులు ఈక్రింది ఫోన్ నెంబర్లలో సంప్రదించండి.
Cell: 8341024666, 7386336662

ఆలోచనల అంకురం.. ఆవిష్కరణల సంబరం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఉద్యోగ సాధనే యువత లక్ష్యంగా ఉండేది. మరి ఇప్పుడో అంటారా! తమ సొంత ఆలోచనలతో కొత్త స్టార్టప్‌లు ప్రారంభించి పది మందికి ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తుండగా- ఆ ప్రయాణంలో వారికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎస్కేయూలో నడుస్తున్న అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఏఐసీ) కొండంత అండగా నిలుస్తోంది. ఆ ఆసరాను అందిపుచ్చుకుని స్టార్టప్‌ల స్థాపన దిశగా అడుగులు వేస్తున్న వారిపై కథనం.

యువతలో వినూత్న ఆలోచనలు ఉన్నప్పటికీ.. వాటిని ఎలా సాకారం చేసుకోవాలి. అనంతరం మార్కెట్‌లోకి ఎలా తీసుకువెళ్లాలి. అందుకు అవసరమైన నిధులు ఎలా సమీకరించుకోవాలన్న దానిపై అవగాహన ఉండటం లేదు. ఇలాంటి వారికి అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ పూర్తిస్థాయి మార్గదర్శనం చేస్తోంది.

మొబైల్ యాప్ చూపుతున్న మధుసూదన్‌రెడ్డి, భవాని

గ్రామీణుల వైద్యానికి ఆసరా 'మవి'యాప్

అనంతపురానికే చెందిన మధుసూదన్ రెడ్డి, భవాని దంపతులు. మధుసూదన్‌కు ఫార్మారంగంలో అనుభవం ఉంటే.. భవాని కంప్యూటర్ సైన్స్ పట్టభద్రురాలు. గ్రామీణ వైద్య సేవల్లో ఏదైనా మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో.. ఇద్దరూ కలిసి ఆ దిశగా కొత్త ఆవిష్కరణలకు ప్రయత్నించారు. మారుమూల గ్రామీణులకు అత్యవసర వైద్య సేవలను దగ్గర చేసేలా 'మవి' అనే మొబైల్ యాప్‌ను రూపొందించారు. జీరో కమీషన్ హెల్త్ కేర్ ప్లాట్‌ఫాం ఇది. ప్రయోగ దశను పూర్తి చేసుకుంది. అటల్ ఇంక్యుబేషన్ సహకారంతో త్వరలోనే వినియోగంలోకి తీసుకురావాలని చూస్తున్నారు. 'రోగులు ఈ యాప్‌ను ఉపయోగించుకుని వైద్య సేవలు, ఔషధాలు పొందొచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా అంబులెన్స్, నర్సింగ్ సేవలు, వైద్య పరికరాలు పొందే అవకాశం ఉంది' అని చెబుతున్నారు.

అరటి వ్యర్థాలతో అద్భుత ఫర్నిచర్

అనంతపురానికి చెందిన అజిత్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి అన్నదమ్ములు. జిల్లాలో విస్తారంగా పండించే అరటి చెట్లు నరికేసిన తర్వాత వృథాగా పడేసే కాండాలు, వ్యర్థాలతో ఫర్నిచర్, బోర్డులు తయారు చేయాలన్న ఆలోచన చేశారు. అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో వాటిని పంచుకున్నారు. వారిచ్చిన మార్గదర్శకాల ప్రకారం.. వివిధ పద్ధతులను అనుసరించి ఫర్నిచర్ తయారీకి కృషి చేశారు. ఆ క్రమంలోనే 'ధన్విన్ ఎకో ఉడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను స్థాపించారు. 'అరటి వ్యర్థాలతో ఒక వైపు ఆదాయం పొందొచ్చు. మరోవైపు కాలుష్య నివారణకు కృషి చేయవచ్చు. ఏఐసీ సహకారంతో ఎస్ఐఎస్ఎఫ్ఎస్ పథకం కింద పొందిన రూ.అయిదు లక్షల రుణం స్టార్టప్ స్థాపనకు ఎంతో ఉపయోగపడింది' అని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అయిదు కేంద్రాల్లో.. నేడు నీట్ పీజీ పరీక్ష

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని అయిదు కేంద్రాల్లో ఆదివారం జరగనున్న నీట్ పీజీ పరీక్షను సజావుగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. అనంతపురం నగర శివారులోని బీకే సముద్రం రోటరీపురం ఎస్ఆర్ఐటీ, ఎస్కేయూ సమీపంలోని అనంతలక్ష్మి, చిన్మయనగర్‌లోని నేషనల్ చర్చి, తాడిపత్రి శివారులోని సీవీరామన్, తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్ష జరగనుంది. మొత్తం 979 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు, అధికారులకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు.

హంద్రీనీవా ప్యాకేజీ నం.18 పనుల పరిధి మార్పు

ఈనాడు, అనంతపురం: హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ఫేజ్-2 ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టులో ప్యాకేజీ నం.18 కింద ఉన్న కాలువ పరిధిని (463 కి.మీ. నుంచి 490 కి.మీ. వరకు) అనంతపురం విభాగానికి బదులుగా ఇకపై తిరుపతిలోని ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్, మదనపల్లి హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-03 నియంత్రణలోకి బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులిచ్చింది. ఈ ప్యాకేజీ పరిధిలో కాంక్రీట్ లైనింగ్ పనులు, పర్యవేక్షణ, సాంకేతిక అనుమతులు వంటి బాధ్యతలన్నీ కొత్త విభాగానికి అప్పగించారు. శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల పరిధిలోని ఈ ప్యాకేజీ పనుల వ్యయం రూ.1,323.75 కోట్లు. ప్రాధాన్యం ఉన్న ఈ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని నీటిపారుదల ఇంజినీర్ ఇన్ చీఫ్‌తో పాటు సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

(c) eenadu

చిత్రకళా కిరణం

జాతీయస్థాయి ఆర్ట్ క్యాంపులో ప్రదర్శనలు

ఆ యువకుడు కుంచె పడితే చాలు కాన్వాస్‌పై రంగులు జీవం పోసుకుంటాయి. తన సృజనతో సజీవ చిత్రాలను ఆవిష్కరిస్తూ చిత్రకళా రంగంలో గుర్తింపు తెచ్చుకుంటున్న చిత్రకారుడు భానుకిరణ్ జాతీయ స్థాయి ఆర్ట్ గ్యాలరీలో పదుల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన గురించి తన మాటల్లోనే తెలుసుకుందాం రండి..

-న్యూస్‌టుడే తాడిపత్రి

భానుకిరణ్

తాడిపత్రి పట్టణంలోని పుట్లూరు రోడ్డు మా నివాసం. అమ్మానాన్నలు నారాయణస్వామి, ఈశ్వరమ్మ. నాన్న వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. చిన్నప్పుడు ప్రభాత సమయంలో పొలానికి వెళ్లేటప్పుడు ప్రకృతి ఎంతో రమణీయంగా కనిపించేది. అప్పుడే నాకు చిత్రకళపై ఆసక్తి కలిగింది. కాగితాలపై నచ్చిన చిత్రాలు గీసి రంగులు వేసేవాడిని. పదో తరగతి సమయానికి చిత్రంపై పట్టు వచ్చింది. అదే ఆసక్తితో డిగ్రీ (బీఎస్సీ)లో మల్టీమీడియా, యానిమేషన్ పూర్తి చేశా. చిత్రలేఖనం, గ్రాఫిక్స్ కోర్సులు నేర్చుకున్నా. కొన్నాళ్లు పలు సినిమాలకు గుంపులో గోవిందలా గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేశా. అనంతరం పూర్తి సమయం చిత్రలేఖనానికి కేటాయించా. ప్రస్తుతం మోనోక్రొమాటిక్ శైలిలో చిత్రాలు గీశా. సోలోగా ఒక ఆర్ట్ క్యాంపు నిర్వహించా. మంచి స్పందన వచ్చింది. దిల్లీ, హైదరాబాద్, ముంబయి, పుణె వంటి నగరాల్లో 11 గ్రూపు ఆర్ట్ షోలలో నా చిత్రాలను ప్రదర్శించా. అనేక బహుమతులు అందుకున్నా. అయినా ఏదో అసంతృప్తి. కళ, సంస్కృతి, విద్య, ఆధునిక సృజనను మిళితం చేసి చిత్రాలను గీసి ఒకే వేదికపైకి తెచ్చేలా పెద్ద ప్రదర్శనశాల నిర్మించాలన్నదే నా లక్ష్యం.



పెన్సిల్‌తో ప్రకృతి చిత్రలేఖనం

పూలమొక్కలకు నీరు పోస్తున్న చిన్నారి

చిట్టి చేతులు.. గట్టి పంచ్‌లు

తైక్వాండోలో జాతీయ పోటీలకు ఎంపిక

చిరు ప్రాయంలోనే పిడికిలి బిగించారు. పంచ్‌లు, కిక్కులతో ప్రత్యర్థులను చిత్తుచేసి తైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చిన్న వయసులోనే ఆత్మరక్షణ విద్యపై ఇష్టం పెంచుకొని శిక్షకుడి ఆధ్వర్యంలో మెలకువలు పట్టేసి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాల పంట పండించారు. వారే తాడిపత్రి పట్టణానికి చెందిన చిన్నారులు యశస్వి భారతి, ఆరాధ్య. ఆ విజయాల గురించి వారి మాటల్లోనే తెలుసుకుందాం రండి..

-న్యూస్‌టుడే, తాడిపత్రి

బరిలో దిగితే పతకమే

తాడిపత్రిలోని కృష్ణాపురం 6వ రోడ్డులో ఉంటున్నా. నా పేరు **యశస్వి భారతి.** మూడో తరగతి చదువుతున్నా. అమ్మానాన్నలు రంగనాథ్, పద్మజ. నాన్న చీరల వ్యాపారం చేస్తున్నారు. గత రెండేళ్లుగా తైక్వాండోలో శిక్షణ పొందుతున్నా. అనంతపురం, తాడిపత్రిలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో రెండు పతకాలు వచ్చాయి. ఈ నెల 27న శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి బంగారు పతకం తెచ్చుకున్నా. అక్టోబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక చేశారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం తేవాలన్నదే నా లక్ష్యం.

మొదటి సారే స్వర్ణం

నా పేరు **ఆరాధ్య.** తాడిపత్రిలోని అంబేడ్కర్‌నగర్‌లో ఉంటున్నా. అమ్మానాన్నలు బాలరాజు, రజియా. నాన్న పోలీసు. రెండో తరగతి చదువుతున్నా. గతేడాది నుంచి తైక్వాండోలో శిక్షణ తీసుకుంటున్నా. ఈ నెల 27న శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తొలిసారి రింగ్‌లోకి దిగి ఏకంగా స్వర్ణ పతకం పట్టేశా. ఇంకేముంది అక్టోబరులో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసేశారు. తైక్వాండో అంటే నాకు చాలా ఇష్టం. ఈ ఆటలో మెరుగ్గా రాణించాలన్న పట్టుదలతో బాగా సాధన చేస్తున్నా.

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

V-Guard సోలార్ వాటర్ హీటర్స్ & సోలార్ వాటర్ పంప్స్ సేల్స్ చేయుటకు ఏరియాలవారిగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. సంప్ర: సాపా ప్లోరాటెక్: 9553366693 ATP.

BUSINESS OFFER

FRANCHISEE OFFER in all Districts for International Tour Packages & 3 Hotel Property Memberships. Con: 73868 88119.

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించికొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం., సెల్: 7382114647

ఫ్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనరీ బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

Loans for House Constructions, Purchase, Mortgage Plot / Flat Purchase in Municipality K.Phanikumar C.R.A LIC HFL ATP 8309741794, 9440132798

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ, LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 8961920779

REAL ESTATE

మీకు 20సెంట్ల ఇండ్ల స్థలం అనంతపురంలో ఉందా. మీరు డెవలప్‌మెంట్‌కు ఇచ్చే ఉద్దేశ్యం ఉంటే సంప్రదించండి. రామ్: 6304622428

HOUSE FOR SALE

ATPటౌన్, గుండమ్మ కాంపౌండ్ గేట్ ఎదురులైను, గుల్జార్‌పేట్ D.No.9/201 North face (21.5x51.5), 2.54 సెంట్ల పాతఇల్లు (సైట్ Value మాత్రమే) అమ్మబడును. ✆ 9440285259

ATPటౌన్, సోమనాథ్‌నగర్, స్టార్ స్టీల్స్ పక్కన, Plot No-34, D.No-3/484 (33x66) 5 సెంట్లు West face ఇల్లు అమ్మబడును. సెల్: 7569796547

ATPటౌన్, వేణుగోపాల్‌నగర్, విద్యానికేతన్ స్కూల్ దగ్గర, Plot 34, L.P. No: 125/82, D.No. 17/1/10, (33x66) West face, 5 సెంట్ల పాత ఇల్లు (సైట్ Cost మాత్రమే) అమ్మబడును. 7569796547

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

Agricultural Prime Land for Sale - 7.5+ acres near Penukonda (Sri Satyasai District) @ Rs. 30L /- per acre (2 water borewells, Multiple source of income available) For more details, contact +919880116940

PLOT FOR SALE

అనంతపురం - ఆలమూరు మెయిన్ రోడ్డు నుండి 500 మీటర్ల లోపల రోడ్డు ఫేసింగ్ కు 202-1 B మొత్తం 11.5 సెంట్లు, 202-1 G మొత్తం 30 సెంట్లు, 202-2 మొత్తం 77 సెంట్లు, 202-3 మొత్తం 9 సెంట్లు, 202-5 మొత్తం 9 సెంట్లు అమ్మబడును. ఆసక్తి గలవారు. సంప్ర: ఫోన్: 7093037333

TO LET

ATPటౌన్ రామ్‌నగర్, నారాయణ స్కూల్ దగ్గర 2 BHK అన్ని వసతులతో ప్రభుత్వ/ ప్రైవేట్ ఉద్యోగులకు బాడుగకు ఇవ్వబడును. సెల్: 9603621999

COMMERCIAL

అనంతపురం, రామ్‌నగర్ బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా రుద్రంపేట బైపాస్ దగ్గర 15000 Sft స్థలము బాడుగకు ఇవ్వబడును. ఫోన్: 9440823006

JOBS

Staff required for Callboy/ Caretaker Post in Railway running room Guntakal. Attractive Salary. Food, EPF & ESI also there Cont No: 8374437305

Wanted Computer Lecturer, Computer Lab Assistant & Lady Warden, Work at Hindupur College. Contact: 9030501786

WANTED HD Sales Officers for Eicher Commercial Vehicles Qual: Any Degree Con: 99894 89962 E mail: dsrinivasarao@hitechvecv.in

ATPలో పనిచేయుటకు రైజిన్ గ్రాడ్ స్టడీ అబ్రాడ్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు కౌన్సిలర్‌లు కావలెను. అర్హత: డిగ్రీ. Ph: 9177278208.

కల్లూరు ఎస్టేట్ లో ప్రముఖ కెమికల్ ఫ్యాక్టరిలో అడ్మిన్ డిపార్ట్‌మెంట్ నందు పని చేయుటకు అనుభవజ్ఞులైన Operations Manager, Asst Operation Manager & అకౌంట్స్ మేనేజర్ కావలెను. కర్నూలు. 9581827461, 6302432657.

లేడీస్ టైలర్స్ కావలెను. గార్మెంట్స్ నందు టైలరింగ్ చేయుటకు ATP స్థానికులకు మాత్రమే. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. ✆ 9908147806

తెలుగు మ్యారేజ్ బ్యూరో అనంతపూర్ బ్రాంచి నందు పనిచేయుటకు డిగ్రీ చదివి కంప్యూటర్ పరిజ్ఞానం గల మహిళా అభ్యర్థులు కావలెను. సంప్ర: Cell: 988 514 1199, 9848 74 5959

మా కంపెనీలో పనిచేయుటకు Computer Operator పురుషులు కావలెను. వయస్సు 40లోపు, జీతం: 9,000 to 10,000 సంప్ర: కమలానగర్, ATP. Cell 9493181828

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీకు ATPలో పనిచేయుటకు సీనియర్ ఇంజనీర్ 5 to 8 సం||ల అనుభవం మరియు డ్రైవర్ కావలెను. సెల్: 7779992688.

ఆర్వి డిజిటల్స్ - తిరుపతి నందు పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసినవారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86880 56789.

Exp. ఆయాలు / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/-నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

కొత్త పరిశ్రమలపై దృష్టి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. శనివారం మినీ కాన్ఫరెన్సు హాలులో పరిశ్రమల ఎగుమతుల కమిటీ సమావేశం నిర్వహించారు. కొత్త పరిశ్రమల ప్రారంభానికి వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి అనుమతులు ఇవ్వాలన్నారు. నెడ్‌క్యాప్‌కు చెందిన 29 ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రాయదుర్గంలో నిర్మించే పరిశ్రమలకు భూ సమస్యను తీర్చాలన్నారు. సమావేశంలో డీఐసీ జీఎం శ్రీనివాస్‌యాదవ్, ఏడీ రాజశేఖర్‌రెడ్డి, ఎల్‌డీఎం మారుతీ శ్రీనివాసులు, డైరెక్టర్ లక్ష్మిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలోని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో పని దినాల్లో రోజూ విధిగా పీజీఆర్ఎస్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు కార్యాలయాల్లోనే ఉంటూ ప్రజల నుంచి అర్జీలు తీసుకోవాలన్నారు. విధులకు గైర్హాజరయ్యే వారిపై తీవ్ర చర్య తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చెలరేగిన బౌలర్లు... నెల్లూరు జట్టు జయభేరి

ఎస్.అఖిల్ (రెండు ఇన్నింగ్స్‌లో 12 వికెట్లు) జీవీ.చరణ్‌జిత్ (84) కేఆర్.రుషిల్ (82)

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్. అఖిల్ రెండు ఇన్నింగ్స్‌లో 12 వికెట్లు కూల్చడంతో సౌత్ జోన్ అంతర్ జిల్లా అండర్-23 క్రికెట్ మూడు రోజుల పోటీలో నెల్లూరు జట్టు కడప జట్టుపై 5 వికెట్ల తేడాతో గెలిచింది. బౌలర్ల దెబ్బకు మూడురోజులు జరగాల్సిన పోటీ ఒక టిన్నర రోజుకే ముగియడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రాయలసీమ క్రికెట్ మైదానంలో శనివారం ఉదయం ఓవర్‌నైట్ స్కోరు 66/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కడప జట్టు నెల్లూరు బౌలర్ల దెబ్బకు 42.2 ఓవర్లలో 157 పరుగులకే కుప్పకూలింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 115 పరుగుల విజయ లక్ష్యాన్ని 14.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి సాధించింది. బ్యాటరు మాన్విత్‌రెడ్డి (52) బాధ్యతాయుత బ్యాటింగ్‌తో జట్టును గెలిపించాడు.

డ్రా దిశగా అనంతపురం, చిత్తూరు పోటీ

అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో పోటీ డ్రా దిశగా పయణిస్తోంది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 437 పరుగులకు ఆలౌట్ కాగా... చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో రెండోరోజు ఆటముగిసే సమయానికి 80 ఓవర్లలో 5 వికెట్లకు 342 పరుగులు చేసి ఆధిక్యం దిశగా సాగుతోంది. చివరిరోజు మరో 96 పరుగులు జోడిస్తే మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టుకు ఆధిక్యత లభిస్తుంది. చిత్తూరు బ్యాటర్లు చరణ్‌జిత్ (84), రుషిల్ (82) చక్కటి బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు. చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ కూడా పూర్తికానందున మ్యాచ్ డ్రా కావడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఈ శ్రావణ మాసంలో మీ ఈనాడు పెళ్ళిపందిరితో సంతోషకరమైన పెళ్లిళ్లకు శ్రీకారం!

దేవాంగ వధువరులకు సువర్ణావకాశం

నేడు దేవాంగ వధువరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి', దేవాంగ వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (ఆదివారం, ఆగస్టు 30న) ఉదయం 9 గం॥ నుంచి సాయంత్రం 5.30 గం॥ వరకు** తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 91543 66099 & 91547 72006 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చు.

● వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలిపిన వాట్సప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్‌ను ఫోన్ యాప్ ద్వారా చేసుకోవచ్చు.

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్): స్వర్ణాంధ్ర-2047 సాధనే ఏకైక లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర అర్థ గణాంక శాఖ డైరెక్టర్ బి.గోపాల్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఆ శాఖ ఎస్ఓ, ఏఎస్ఓ, ఏఓ, హెచ్‌ఓలకు జీఎస్‌డీపీపై అవగాహన కల్పించారు. డైరెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు తగిన శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయాన్ని పెంచేలా ఏమి చేస్తే బాగుంటుందన్న దానిపై తర్ఫీదు ఇస్తామన్నారు. డివిజన్, మండల స్థాయిలో శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో జేడీ అశోక్‌కుమార్, సీపీఓ బాలాజీనాయక్, పీఏహెచ్ఈఎల్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

అండర్ పాస్ ఏర్పాటు చేయాలని ఆందోళన

నిరసన తెలుపుతున్న మహిళలు

రాప్తాడు, న్యూస్‌టుడే: అయ్యవారిపల్లి-నాయక్‌నగర్ క్రాస్ వద్ద వాహనాల అండర్ పాస్ ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు శనివారం జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అయ్యవారిపల్లి క్రాస్ వద్ద గతంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వీయూపీ నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు. అయ్యవారిపల్లి, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, వరిమడుగు, పాలచెర్ల భోగినేపల్లి గ్రామాల ప్రజలు అనంతపురానికి రాకపోకలు సాగించడానికి ఈ రహదారి కీలకం. అయితే ఇక్కడ రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతిపాదించిన ప్రసన్నాయపల్లి క్రాస్ స్థానంలో అయ్యవారిపల్లి-నాయక్‌నగర్ క్రాస్ వద్ద వాహనాల అండర్ పాస్ ఏర్పాటు చేస్తే అనేక గ్రామాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

ముగిసిన లాన్‌టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు

విజేతలతో డీఆర్ఓ మాలోల తదితరులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ప్రపంచంలో ఎంతో ఆదరణ పొందిన లాన్‌టెన్నిస్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే కఠోరంగా శ్రమించాలని జిల్లా రెవెన్యూ అధికారి మాలోల పిలుపునిచ్చారు. వివిధ స్థాయిల్లో జరిగే పోటీల్లో ఓడినప్పుడు కుంగుబాటుకు గురికాకుండా తప్పులను సరిదిద్దుకోవాలని ఆయన సూచించారు. శనివారం ఆర్డీటీ మైదానంలోని నాదల్ టెన్నిస్ అకాడమీలో జిల్లాస్థాయి లాన్‌టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. లాన్ టెన్నిస్‌తో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటమే కాకుండా ఉత్తమ లక్షణాలు అలవడుతాయన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యుడు అంజనీకుమార్ కోడె, రాష్ట్ర టెన్నిస్ సంఘం సంయుక్త కార్యదర్శి నాగరాజుబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి మానస, కోశాధికారి రమేష్, సభ్యులు బీఆర్ ప్రసన్న, టెన్నిస్ అకాడమీ సమన్వయకర్త విశాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను ప్రకటించారు.

అండర్-10 బాలబాలికలు: ప్రణవ్‌శ్రీరామ్, వి.హర్షవర్ధన్‌రెడ్డి, రిత్విక్ రెడ్డి, అభయ్‌రామ్, పునీత్‌నాయక్, ఎం.లిషస్విచౌదరి, మెహక్‌నాజియా, ఐరా, ఎ.నవిష్క.

అండర్-12 బాలబాలికలు: నిహాంత్ ఆదిత్య, సోనిత్‌రెడ్డి, కె.ఈయిత్, వరద్‌వత్సల్, పి.హర్షవర్ధన్‌రెడ్డి, డి.ఆలియా, పి.సింధుభార్గవి, సి.మోక్షితరెడ్డి, ఎ.యుక్తి, కె.కావ్య.

అండర్-14 బాలబాలికలు: జె.సుప్రతిక్‌రెడ్డి, విశ్వతేజ, ఆర్.పవన్‌సాయి, రాహుల్‌గాంధీ, సి.అభిషేక్, ఎ.హన్సిని, టి.సంహిత, పి.హాసిని, హరిణి, జి.తన్విత.

అండర్-16 బాలబాలికలు: డి.అరిఫా, కె.కారుణ్య.

సీనియర్ పురుషులు, మహిళలు: కె.కృపాల్‌కుమార్, కె.మోహన్, ఎం.లక్ష్మీనరసింహ, ఎస్.కిరణ్‌కుమార్, జి.నీరజ, ఎస్.కిరణ్మయి, జి.గౌతమి, ఎ.జాహ్నవి, కె.తనూష్.

వాహనాలే లేవు.. గస్తీ ఎలా!

కలెక్టర్‌తో జలవనరుల ఏఈల మొర

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: 'క్షేత్ర స్థాయిలో ఏఈఈ పోస్టులు ఖాళీలు ఎక్కువ. ఇప్పటికే ఇద్దరు పని చేస్తున్నాం. తాజాగా.. నీటి నిర్వహణపై గస్తీ తిరుగుతున్నాం. కనీసం వాహనాలు కూడా లేవు. క్షేత్రస్థాయిలో చాలా కష్టాలు అనుభవిస్తున్నాం'.. అంటూ ఏపీ జలవనరుల సహాయ కార్యానిర్వాహక ఇంజినీర్ల (ఏఈఈ) సంఘం తీవ్ర ఆవేదన, విచారం వ్యక్త పరిచింది. శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తరుణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, తదితరులు కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టుల్లో లస్కర్ల కొరత తీవ్రంగా ఉంది. ఏఈఈలే అన్ని పనులు చేయాల్సి వస్తోందన్నారు. ఇప్పుడు నీటి నిర్వహణ పెద్ద కష్టంగా ఉంది. కాలువలపై తిరగడానికి సొంత వాహనాలను వినియోగిస్తున్నాం. ఇంధనం, ఇతరత్రా వ్యయాలన్నీ సొంత జేబు నుంచే పెట్టుకుంటున్నాం. పగలే కాదు.. రాత్రిళ్లు కూడా తిరుగుతున్నాం. ఈమధ్యనే సాజిద్ అనే ఇంజినీరు ద్విచక్ర వాహనం ప్రమాదం బారిన పడ్డారు. ఈయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. కనీస సదుపాయాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

ధ్యాస మళ్లించి చోరీలు

- అంతర్‌జిల్లా ముఠా అరెస్టు
- రూ.60 లక్షల విలువైన బంగారు, వెండి, నగదు స్వాధీనం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంపుగా వెళ్లి గుట్టుగా దోచుకునే దొంగల ముఠాను గుత్తి, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. నిందితుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. వీరి నుంచి రూ.60 లక్షలు విలువ చేసే సుమారు 40 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.1,49,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఎస్పీ జగదీశ్ వెల్లడించారు. రాయదుర్గం పట్టణానికి చెందిన ఎరుకుల రమణమ్మ, ఎరుకుల సుంకమ్మ, గంగమ్మ, రమణమ్మ.. డి.హీరేహాళ్‌కు చెందిన ఆనంద్ సమీప బంధువులు. గుత్తి పట్టణానికి చెందిన వనార్చి చిట్టెమ్మ ఈ ఐదుగురిని కలుపుకొని బృందంగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడేది. చిట్టెమ్మ పాత నేరస్థురాలు. ఈమె వ్యక్తుల వద్ద ఉన్న బ్యాగులను చోరీ చేయడంలో దిట్ట. ఆర్టీసీ బస్టాండ్లు, రద్దీ ప్రాంతాలు, ఆటోల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులను చిట్టెమ్మ ముఠా లక్ష్యంగా చేసుకునేది. బస్సుల్లో, ఆటోల్లో ప్రయాణికుల్లా నటిస్తూ గుట్టుచప్పుడు కాకుండా పర్సులు, చేతి సంచులను కాజేసేవారు. తోటి ప్రయాణికులను కాళ్లతో తొక్కుతూ ఆటంకం కలిగిస్తూ వారి ధ్యాస మళ్లించి బ్యాగులు, చేతిసంచుల్లో విలువైన ఆభరణాలను దోచుకునేవారు. అయితే చిట్టెమ్మ మినహా మిగతా ఐదుగురు ముఠాగా ఏర్పడి ఇళ్లలో చోరీలు చేసేవారు. గుజరీ (పాత వస్తువులు) సేకరించే ముసుగులో కాలనీలు, వీధుల్లో సంచరిస్తూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడ్డారు. గుత్తి పరిధిలో ఈ తరహా చోరీలు జరగడంతో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో గుత్తి సీఐ రామారావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శేషగిరి, జయపాల్‌రెడ్డి, ఎస్సైలు రాజశేఖర్‌రెడ్డి, తులశన్న బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. పక్కా సమాచారంతో నిందితులను పోలీసులు అరెస్టు చేసి జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు.

మహిళా సాధికారతకు ఆర్డీటీ పెద్దపీట

మహిళకు ఆటో అందించి అందులో ప్రయాణిస్తున్న కలెక్టర్ ఆనంద్, మాంచోఫెర్రర్, విశాలఫెర్రర్

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: మహిళా సాధికారత, జీవనోపాధులకు ఆర్డీటీ పెద్దపీట వేసిందని కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆటోలతో జీవనం సాగిస్తున్న 22 మంది మహిళలకు నూతన ఆటోలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయనతో పాటు ఆర్డీటీ ఈడీ అన్నేఫెర్రర్, పీడీ మాంచోఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలన్న లక్ష్యంతో పంపిణీ చేసిన ఈ ఆటోలతో ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. ఆర్డీటీ ఆశయాలకు అనుగుణంగా మహిళలు జీవన ప్రమాణాలు పెంచుకోవాలని సూచించారు. ఆటోల ద్వారా స్వయం ఉపాధి మెరుగవడంతో పాటు ఆత్మస్థైర్యం కూడా పెరుగుతుందన్నారు. అనంతరం ఎంపిక చేసిన మహిళలకు ఆటోలు పంపిణీ చేశారు.

హాకీ అండర్-23 పురుషుల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన శ్రీసత్యసాయి జట్టు

కబడ్డీ అండర్-23 మహిళా విభాగం విజేత అనంతపురం జట్టు

వాలీబాల్ అండర్-17 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన శ్రీసత్యసాయి జట్టు

బాస్కెట్‌బాల్ అండర్-23 మహిళా విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన అనంతపురం జట్టు

అదరగొట్టారు.. ఛాంపియన్లుగా నిలిచారు

కబడ్డీ అండర్-17 బాలికల విభాగంలో రెండో స్థానం సాధించిన శ్రీసత్యసాయి జట్టు

ఈనాడు, చిత్తూరు, న్యూస్‌టుడే, తిరుపతి క్రీడలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు వైభవంగా ముగిశాయి. శనివారం కబడ్డీ, హాకీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్ క్రీడల ఫైనల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు బహుమతులు అందజేశారు.

ఖోఖో అండర్-23 మహిళా విభాగంలో రెండో స్థానంలో నిలిచిన అనంతపురం జట్టు

భార్యను పాశవికంగా కడతేర్చిన భర్త

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: కట్టుకున్న భార్యను.. భర్త పాశవికంగా కడతేర్చాడు. ఈ సంఘటన మదనపల్లె మండలంలో శనివారం జరిగింది. తంబళ్లపల్లె మండలం దిగువపల్లెకు చెందిన మధుకర్‌రెడ్డికి బి.కొత్తకోట మండలం తుమ్మనగుంట పంచాయతీ బండమీద కొత్తపల్లెకు చెందిన దండామణితో వివాహమైంది. వీరికి అమృతారెడ్డి, జశ్వంత్‌రెడ్డి పిల్లలు. 2013 నవంబరు 18న బెంగళూరులోని ఓ బ్యాంకు ఏటీఎంలో డబ్బు డ్రా చేసేందుకు వచ్చిన మహిళ జ్యోతి ఉదయ్‌పై దాడిచేసి కత్తితో విచక్షణా రహితంగా పొడిచాడు. డబ్బు, బంగారంతో పరారయ్యాడు. ఈ కేసులో 2016లో కర్ణాటక పోలీసులు అతని అరెస్టు చేయగా కోర్టు పదేళ్ల జైలుశిక్ష విధించింది. ఈనెల 14న జైలు నుంచి విడుదలైన మధు మదనపల్లెకు వచ్చి భార్య దండామణి (38)తో కలసి ఉండేందుకు రాజీ ప్రయత్నాలు చేశాడు. దివ్యాంగుడైన బావమరిది మందలించడంతో అతని చేతిపై దాడి చేసి విరిచేశాడు. శనివారం మధ్యాహ్నం భార్యను అతను కొడవలితో మెడపై నరికి చంపేశాడు. బావమరిది వీరభద్రారెడ్డి (మృతురాలి సోదరుడు)కి ఫోన్ చేసి దండామణిని చంపేశానని చెప్పాడు. ఇంటికి వెళ్లే సమయానికే రక్తపు మడుగులో పడి ఉన్న కుమార్తెను చూసి అమరావతమ్మ, మృతురాలి సోదరుడు కన్నీటి పర్యంతమయ్యారు. రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు, రూరల్ సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ విష్ణునారాయణలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడు మాట్లాడిన వాయిస్ రికార్డులు పోలీసులకు అందజేశారు. మధుకర్‌రెడ్డిని పట్టుకునేందుకు మూడు బృందాలు ఏర్పాటు చేశామని డీఎస్పీ బుచ్చిరాజు వెల్లడించారు. మధుకర్‌రెడ్డి 2006లో గ్రామంలో బాంబులు వేసి హత్య చేసిన కేసులో యావజ్జీవ శిక్ష పడి కడప జైలులో శిక్ష అనుభవిస్తూ 2011లో జైలు నుంచి తప్పించుకున్నాడు. అనంతరం బెంగళూరుకు వెళ్లిన అతను అక్కడ ఏటీఎంలో మహిళపై హత్యాయత్నం చేసి పరారయ్యాడు. ఇటీవల ఇంటికి తిరిగి వచ్చిన అతను భార్యను దారుణంగా హత్య చేసి పరారయ్యాడు. ఇతనిపై పీలేరు, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో కేసులు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

రెండు బస్సులు ఢీ

8 మంది చిన్నారులకు గాయాలు

మడకశిర, మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న బాలుడిని తప్పించబోయి ఎదురుగా వస్తున్న పాఠశాల బస్సును కర్ణాటక బస్సు ఢీకొన్న ఘటన మడకశిర మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 8 మంది చిన్నారులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల మేరకు మండల పరిధిలోని బుళ్లసముద్రం సూర్యవిద్యానికేతన్ పాఠశాల బస్సులో శనివారం సాయంత్రం 32 మంది విద్యార్థులు స్వగ్రామాలకు బయలుదేరారు. ఇంటికి చేరుతామన్న సంతోషంలో ఉన్న విద్యార్థులకు కర్ణాటక బస్సు రూపంలో ప్రమాదం దూసుకొచ్చింది. రహదారి పక్కనే ఆడుకుంటున్న బాలుడు సుదర్శన్ హఠాత్తుగా రోడ్డు దాటుతుండగా పావగడ నుంచి తుమకూరు వెళ్లే కర్ణాటక బస్సు చిన్నారిని తప్పించబోయి మడకశిర వైపు నుంచి వస్తున్న పాఠశాల బస్సును ఢీకొంది. స్థానికులు గమనించి గాయపడిన విద్యార్థులను బయటకు తీసుకువచ్చి మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ఇరువాహనాల చోదకుల కాళ్లు విరిగాయి. బస్సులో ఉన్న ఆమిదాలగొందికి చెందిన పూజా, గాయని అనే బాలికలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు. సుదర్శన్ తలకు తీవ్ర గాయం కావడంతో మడకశిర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గాయపడ్డ బాలుడు సుదర్శన్

గ్రామస్థుల ఆగ్రహావేశం .. బస్సు ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్థులు అక్కడకు చేరుకున్నారు. ఆగ్రహావేశంతో ప్రమాదానికి కారణమైన కేఎస్ఆర్‌టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న సీఐ రాజ్‌కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన చిన్నారులను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఆర్డీవో నాగప్రసన్నలక్ష్మి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదేశించారు.

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

తిమ్మప్పస్వామికి ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో తిమ్మప్పస్వామి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని విట్లంపల్లి సమీపంలోని కొండలో వెలసిన తిమ్మప్పస్వామికి శ్రావణమాస మూడో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌ను పలు రకాల పుష్పాలతో అలంకరించారు. మెట్ల మార్గంలో భక్తులు కొండపైకి చేరుకుని స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులతో కిటకిటలాడింది. ఈ మాసంలో ప్రతి శనివారం భక్తుల సందడి అధికంగా ఉంటుందని ఆలయ కమిటీ, నిర్వాహకులు తెలియజేశారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోటలో వెలసిన శ్రీ రాఘవేంద్రస్వామి 355వ ఆరాధన మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. శ్రావణ బహుళ పాడ్యమి సందర్భంగా పూర్వారాధన పూజలను నిర్వహించారు. శనివారం ఉదయం అష్టోత్తరం, పంచామృతం, పాదపూజ, ప్రవచనం, ప్రాకారోత్సవం, మధ్యాహ్నం కనకాభిషేకం, హస్తోదకం, మహామంగళ హారతి వంటివి జరిపారు. తీర్థప్రసాదాలు భక్తులు అందజేశారు. సాయంత్రం భజన కార్యక్రమాలను చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: విడపనకల్లులోని అంగన్‌వాడీ కేంద్రంలో సమయపాలన పాటించడం లేదు. -చంద్ర
సమాధానం: అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం. **-సీడీపీఓ శ్రీదేవి** –న్యూస్‌టుడే, విడపనకల్లు

సమస్య: గడేహోతూరులో ముస్లిం వీధిలో రోడ్డుపై మురుగు పారుతుంది. **-అబ్దుల్**
సమాధానం: పరిశీలించి శుభ్రం చేయిస్తాం. **-సుభాంజి, పంచాయతీ కార్యదర్శి, గడేహోతూరు** –న్యూస్‌టుడే, వజ్రకరూరు

స్మార్ట్‌స్ట్రీట్‌ల ఏర్పాటులో జాప్యమేలా

● ట్రాఫిక్ సమస్యకు చక్కటి పరిష్కారం

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రోడ్ల పక్కన, కూడళ్లలో తోపుడు బండ్లు, గంపల్లో పండ్లు, కూరగాయలు పెట్టుకుని చిరు వ్యాపారాలు అమ్ముకుంటున్నారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు వాయు కాలుష్యంతో అనారోగ్యానికి గురవుతున్నారు. వారందరినీ ఒక చోటుకు చేర్చి వ్యాపారాలు చేసుకునేలా స్మార్ట్‌స్ట్రీట్ కేటాయించాలని గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని అమలు చేయడంలో మున్సిపల్ అధికారులు జాప్యం చేస్తున్నారు.

రోడ్డు పక్కన కూరగాయల వ్యాపారాలు చేస్తూ ఇలా..

అందరిని ఒకే చోటుకు..: పట్టణంలో రోడ్ల పక్క వ్యాపారాలు చేసే వారు దాదాపు వేయి మంది దాకా ఉన్నారు. ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కూరగాయల మార్కెట్లో పండ్లు, కూరగాయలు ఒకే చోట అమ్ముకునేలా స్థలం ఉంది. ఇటీవల సిమెంట్ కాంక్రీట్‌తో ప్లాట్ ఫాంను కూడా ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో కొందరు అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న షెడ్లను తొలగించి వాటిని చిరు వ్యాపారులందరికి కేటాయిస్తే బాగుంటుందని పలువురు చెబుతున్నారు. అటు వినియోగదారులకు ఇటు వాహనదారులకు ఇబ్బందులు తొలుగుతాయి. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. దాంతో చిరు వ్యాపారులు రోడ్ల హద్దులు దాటి అమ్మకాలు సాగిస్తుండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఎక్కడెక్కడంటే..

మెప్మా ఆధ్వర్యంలో చిరువ్యాపారులు 603 మందికి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. పట్టణంలో మిగిలిన మరో వేయి మంది చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పట్టణంలోని పాత బస్టాండు ఎదుట, దేవాదాయశాఖ వ్యాపార దుకాణాల ఎదుట, గాంధీ విగ్రహం వద్ద, వినాయక సర్కిల్‌కు నాలుగు వైపులా, ప్రభుత్వాసుపత్రి ఎదుట, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద, కణేకల్లు రోడ్డులో స్టేట్ బ్యాంకు ఎదుట, బళ్లారి రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కన వ్యాపారాలను నిర్వహిస్తున్నారు.

త్వరలోనే స్థలాలు కేటాయిస్తాం..

-వి.దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లోనే స్మార్ట్‌స్ట్రీట్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ విజయవంతమయ్యాయి. త్వరలో రాయదుర్గంలో కూడా ఏర్పాటు చేస్తాం. పట్టణంలోని చిరు వ్యాపారులందరినీ ఒకే చోటుకు చేర్చేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే స్థలాల కేటాయిస్తాం. పట్టణంలోని చిరు వ్యాపారులందరికి గుర్తింపు కార్డులు ఇచ్చి వారి స్వావలంబనకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తాం.

జిల్లా ఉత్తమ క్రీడా పాఠశాల ఎంపిక

అవార్డు అందుకున్న నూతిమడుగు విద్యార్థులు, సిబ్బంది

కంబదూరు, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అందజేసే స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఈ ఏడాది మండలంలోని నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైంది. శనివారం అనంతపురం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆయూబ్ హుస్సేన్, ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, లక్ష్మన్న చేతుల మీదుగా నూతిమడుగు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి అవార్డును అందుకున్నారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 268 పాయింట్లతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి, అనంతపురం జిల్లాలోనే ఉత్తమ క్రీడా పాఠశాలగా గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవరాయుడు, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి ప్రాతిపదికన అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సహదేవుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రసాయన శాస్త్రం, గణిత శాస్త్రం, ఆంగ్లం, కంప్యూటర్ అప్లికేషన్ బోధించేందుకు పీజీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, సెప్టెంబరు1న ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరు కావాలన్నారు.

కళ్యాణదుర్గంలో వ్యాయామ పోస్టులకు..

కళ్యాణదుర్గం: అతిథి వ్యాయామ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హర్షలత ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎం.పి.ఈడీ పీజీ కలిగి అందులో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఏపీ సెట్, నెట్, పీహెచ్‌డీ అర్హతలు ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని, అర్హత కలిగిన వారు సర్టిఫికెట్లతో ఈ నెల 31వ తేదీన కళాశాలలో హాజరుకావాలని తెలియజేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

వజ్రకరూరు, న్యూస్‌టుడే: మండలం గంజిగుంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుమ్మర చంద్రశేఖర్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మండల కన్వీనర్ గోనుగుంట్ల నాగేంద్ర భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పయ్యావుల కేశవ్ సోదరుల సహకారంతో వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

బీటీపీకి నీరందించి రైతుల కష్టాలు తీరుస్తాం

కరిగానిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కుందుర్పి, న్యూస్‌టుడే: భైరవానితిప్ప సాగునీటి ప్రాజెక్టుకు కృష్ణా జలాలతో నీరందించి కళ్యాణదుర్గం నియోజకవర్గం రైతుల కష్టాలు తీరుస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని తెనగల్లు, కరిగానిపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన ప్రజాసంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కష్టాలు తీర్చేందుకు బీటీ ప్రాజెక్టుకు సాగునీరు, కుందుర్పి బ్రాంచ్ కెనాల్ కాలువ ద్వారా 114 చెరువులకు కృష్ణా జలాలతో నింపి, బీడు భూముల్ని సస్యశ్యామలం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తెనగల్లు, కరిగానిపల్లి ఉన్నత పాఠశాల 9, 10 చదివే విద్యార్థులకు ఎస్సార్సీ ట్రస్టు తరపున ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. కరిగానిపల్లిలో శుద్ధజల కేంద్రానికి శంకుస్థాపన చేశారు. తెనగల్లులో వాల్మీకి విగ్రహం సుందరీకరణకు రూ.లక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ లక్ష్మీదేవి, రామకృష్ణ, ధనుంజయ, చిత్రలింగప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాలకు తావు లేకుండా ప్రత్యేక చొరవ

ఉరవకొండ, న్యూస్‌టుడే: గ్రామాల్లో సివిల్ అంశాల వివాదాలకు తావు లేకుండా చూడడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మొయినుద్దీన్ పేర్కొన్నారు. శనివారం ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ మండల పరిషత్ ఉద్యోగులకు ఆయన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వారు జారీ చేసే ఆస్తి, విలువ ఆధారిత పత్రాల్లో వ్యత్యాసాలకు అవకాశం లేకుండా ఉండాలని సూచించారు. వాటిని అడ్డు పెట్టుకొని అనవసరమైన వివాదాలకు ప్రజలు పోకుండా ఉండేలా చూడడంతో కీలక పాత్ర పోషించాలని చెప్పారు. ఆయన కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌పై బ్యాంకర్లతో సమావేశాన్ని నిర్వహించారు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మొయినుద్దీన్

తేనెలొలుకు తెలుగు.. తియ్యని పలుకు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో శనివారం తెలుగుభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి జన్మదినోత్సవం సందర్భంగా ఈ వేడుకలు చేపట్టారు. ఆయన సేవలు స్మరించుకున్నారు. జిల్లా కవులకు గిడుగు రామమూర్తి తెలుగు భాష- 2026 సేవా పురస్కారాలు అందజేశారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. **-న్యూస్‌టుడే బృందం**

రాయదుర్గం పట్టణం: బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

కళ్యాణదుర్గం: శ్రీకృష్ణదేవరాయులు, కవుల వేషధారణలో విద్యార్థులు

వినాయక ఉత్సవ సేవా సమితి కమిటీ ఏర్పాటు

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని, ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి కళ్యాణదుర్గం ఉత్సవ సేవా సమితిని ఏర్పాటు చేసినట్లు సమితి గౌరవ అధ్యక్షుడు అరవింద్‌కుమార్ తెలిపారు. శనివారం సభ్యులందరూ సమావేశమై కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవ ఉపాధ్యక్షుడిగా తుమ్మల మహేంద్రచౌదరి, సలహాదారుగా శ్రీధర్, అధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జయప్రకాష్, ఉపాధ్యక్షుడిగా జగన్, సలహాదారుగా పవన్‌కుమార్ యాదవ్, కోశాధికారిగా సతీష్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శ్రీకాంత్, చందు, దిలీప్, ప్రచార కార్యదర్శులుగా తరుణ్, హనుమాన్‌లతో నూతన కమిటీని ప్రకటించారు.

బోధనా సామగ్రి అందజేత

ఉరవకొండ: పాఠశాల స్థాయి నుంచే శాస్త్ర సాంకేతిక విషయాలపై విద్యార్థులు పట్టు సాధించాలని సుజలాన్ సంస్థ ప్రతినిధి శరవణకుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.40 వేల విలువైన సబ్జెక్టుల బోధన సామగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అగ్నిమాపకదళ సీఐ భీమలింగ, సంస్థ ప్రతినిధులు శంకర్‌రావు, ప్రవీణ్‌కుమార్, గురునాథ్, సుభాని, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఎరువు దిబ్బలను తొలగించరూ

కళ్యాణదుర్గం మండలంలోని కుర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరీ పక్కనే ఎరువు దిబ్బలు వేశారు. వాటి ద్వారా రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అలాగే పక్కన ఉన్న విద్యార్థులకు దుర్వాసన వ్యాపిస్తూ.. దోమలకు ఆవాసంగా మారుతుంది. విద్యార్థులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఈ విషయమై ఎంఈవో-2 బాబును వివరణ కోరగా అక్కడి దిబ్బలను తొలగిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**



పెచ్చులూడుతున్నా.. పట్టించుకోరా?

పట్టణంలోని మూడు, నాలుగు వార్డు డిపెప్ పాఠశాల పైకప్పు శిథిలావస్థకు చేరింది. పెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతుండటంతో భయాందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలకు రెండు గదులుండగా ఒక గదిలో పెచ్చులు ఎక్కువగా పడుతుండటంతో మరో గదిలోకి మార్చారు. దాంట్లో కూడా అదే పరిస్థితి ఉండటంతో విద్యార్థులను ఓ మూలన కూర్చోబెడుతున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, రాయదుర్గం**

గుంతే.. గమనించకపోతే అంతే

రాయదుర్గం పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులో క్రిసెంటు పాఠశాలకు వెళ్లే దారి మధ్యలో గుంత ఏర్పడింది. ఈ దారిలో నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. గమనించకుండా వేగంగా వచ్చిన చోదకులు గుంత తప్పించే ప్రయత్నంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై ఫిట్టర్ జగన్నాథ్‌ను వివరణ కోరగా గుంతను పూడ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం**

రిక్షాబండి.. మూలన పడిందండి

మండలంలోని బొమ్మనహాళ్, శింగానహళ్లి, లింగదహాళ్, కొలగానహళ్లి గ్రామాల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించే రిక్షాబండి మరమ్మతులు గురై మూలన పడింది. దీంతో గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లతో చెత్తాచెదారం తొలగింపు అంతంత మాత్రమే జరుగుతుంది. చెత్త, మురుగు పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ విషయంపై ఉప ఎంపీడీవో వెంకటరమణ దృష్టికి తీసుకుని వెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, బొమ్మనహాళ్**

నమో ఆంజనేయం.. భక్తులకు అభయం

బొమ్మనహాళ్, డి. హీరేహాళ్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో నేమకల్లు ఆంజనేయస్వామి, మురడి ఆంజన్నకి శ్రావణ మాసం మూడో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి జలాభిషేకం చేశారు. తులసి అలంకరణ, పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూకట్టారు. జిల్లా నలమూలల నుంచి హనుమాన్ దర్శన్ కింద నేమకల్లు, మురడి, కసాపురం ఆంజనేయ స్వాములను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

డి.హీరేహాళ్: పుష్పాలంకరణలో మురడి ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు

ఓటర్ల దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సూర్యప్రతాప్

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో శని, ఆదివారాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉండి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ సూర్యప్రతాప్ తెలిపారు. మండలంలోని ఆవులదట్ల గ్రామంలోని 240, 241 పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం సందర్శించారు. కొత్త ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కోసం ఓటర్ల నుంచి ఫారం- 6 దరఖాస్తులను స్వీకరించారు. రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట ఐదు మండలాల్లో స్పెషల్ ఛాంపియన్ డే సందర్భంగా కొత్త ఓటరు నమోదు కోసం 63, ఓటరు కార్డు సవరణ కోసం 87 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వివరించారు.

సెపక్ తక్రాలో ద్వితీయ స్థానం

విడపనకల్లు, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి 6వ జూనియర్ బాలికల సెపక్ తక్రా ఛాంపియన్ షిప్‌లో మండలంలోని కరకముక్కల జడ్పీ ఉన్నత పాఠశాల బాలికల జట్టు ప్రతిభ కనబరిచారు. చాబాలలో జరిగిన ఈ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజ్మతుల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్, తల్లిదండ్రులు అభినందించారు. క్రీడారంగంలో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు.

కప్పుతో విద్యార్థినులు

మండల వైద్యాధికారి బాధ్యతల స్వీకరణ

వజ్రకరూరు, న్యూస్‌టుడే: మండల వైద్యాధికారిగా బెన్ సజీవ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న డాక్టర్ తేజస్వీ మెటర్నిటీ సెలవులో వెళ్లారు. కొట్టాలపల్లి పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బెన్ సజీవ్ వజ్రకరూరు పీహెచ్‌సీలో అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించి, సమయపాలన పాటించాలన్నారు.

భార్యపై భర్త దాడి.. తీవ్రగాయాలు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల కారణంగా భార్యపై భర్త దాడి చేసిన ఘటన మండలంలోని గంగవరం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన భానుకు కణేకల్లు గ్రామానికి చెందిన యాసిన్‌తో 16ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. కొంత కాలంగా మట్కా, జూదానికి అలవాటు పడ్డాడు. భార్య అనుమానం పెంచుకోవడంతో పుట్టింట్లోనే ఉంటుంది. శుక్రవారం రాత్రి వారిద్దరి మధ్య గొడవ జరగడంతో ఇంట్లో ఉన్న కత్తితో మెడపై పొడిచి, రోకలితో ముఖంపై దాడి చేసి పారిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

పురుగుమందు తాగి రైతు బలవన్మరణం

పిల్లలపల్లి(బ్రహ్మసముద్రం), న్యూస్‌టుడే: మండలంలోని పిల్లలపల్లి గ్రామానికి చెందిన నాగరాజు(57) అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల వివరాలు మేరకు నాగరాజు తనకున్న ఇంటిని తనఖా పెట్టి ఓ ఫైనాన్స్ కంపెనీలో రుణం తీసుకున్నారు. నెలవారీ కంతులు కట్టలేక, కుటుంబం కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది పొలంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. అతనికి భార్య నాగలక్ష్మి, కుమారుడు రాజు ఉన్నారు.

వేటకొడవళ్లతో దాడి.. యువకుడికి గాయాలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో శనివారం రాత్రి యువకుడిపై దాడి ఘటన కలకలం రేపింది. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. ఉరవకొండ మండలం పెద్దముష్టూరు గ్రామానికి చెందిన చరణ్ వారం రోజుల క్రితం శ్రీధరఘట్టకు వచ్చారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం గ్రామంలో వాటర్ ప్లాంట్ సమీపంలో అతడిపై కొందరు వేటకొడవళ్లతో దాడి చేయగా.. చరణ్ మెడపై, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు అరవగానే అక్కడి నుంచి ఎవరికి వారు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై ఆరా తీశారు. ప్రాథమిక విచారణలో ప్రేమ వ్యవహారమే దాడికి కారణమని తెలుస్తోందని ఎస్సై నబీరసూల్ తెలిపారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉందన్నారు.

బంగారు, వెండి ఆభరణాల చోరీ

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు పగుల గొట్టి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు దోచుకెళ్లినట్లు బాధితుడు ఆనంద్ తెలిపారు. బాధితుడి వివరాల మేరకు.. రాయదుర్గంలోని ఈశ్వర్ నగర్‌లో నివాసముంటున్నారు. శుక్రవారం కర్ణాటకలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి అందరూ కలిసి వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి వచ్చే సరికి బీరువాను పగులగొట్టారు. అందులోని రెండు తులాల బంగారు, అయిదు తులాల వెండి వస్తువులతో పాటు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లినట్లు వాపోయారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సురేశ్ ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

బొలెరో బోల్తా.. తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కంబదూరు మార్గంలో మారెమ్మ ఆలయం వద్ద టమాట లోడ్‌తో వెళ్తున్న బొలెరో బోల్తా పడింది. ఆ మార్గంలో గొర్రెలు వెళ్తుండగా వాటిని తప్పించబోయి రోడ్డు పక్కనే అదుపు తప్పి బోల్తాపడి పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో ఎవరికి ఏం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని వివరాలు ఆరా తీశారు.

కేబుల్ తీగల చోరీలు.. రైతుల బెంబేలు

వరుస ఘటనలతో స్థానికుల్లో కలవరం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రాల్లోని బోరుబావులకు అమర్చిన కేబుల్ తీగలు, స్టార్టర్ పెట్టెల్లోని పరికరాలు వరుసగా చోరీలకు గురవుతున్నాయి. ఒక వైపు అరకొరగా ఉన్న నీటితోనే పంటలను సాగు చేసుకుంటే.. మరో వైపు ఈ చోరీలు అన్నదాతలను ఆందోళనలోకి నెట్టేస్తున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి బోరు బావుల మోటార్లకు కేబుళ్లు అమర్చినవి అపహరిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నా.. నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇటీవల జరిగిన సంఘటనలు..

- భట్టువానిపల్లిలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న పంచాయతీ బోరుబావికి అమర్చిన 30 మీటర్ల కేబుల్ తీగను ఎత్తుకెళ్లారు.
- భట్టువానిపల్లిలో వ్యవసాయ క్షేత్రాల్లో బోరుబావులకు అమర్చిన.. పెద్దన్నకు చెందిన 30 మీటర్లు, శీనప్ప తోటలో 20 మీటర్లు, నాగభూషణకు చెందిన 30 మీటర్ల కేబుల్ తీగలు చోరీ చేశారు.
- వర్లిలో పెద్దన్న తోటలో 30 మీటర్లు, మధుకు చెందిన 25 మీటర్లు, నాగభూషణంకు చెందిన 40 మీటర్ల కేబుల్ తీగలను కత్తిరించుకెళ్లారు.
- గరుడాపురంలో రైతు బసవరాజు చెందిన రూ.25వేలు విలువ చేసే స్టార్టర్ పెట్టెలోని పరికరాలు, రూ.15వేలు విలువ చేసే 10 మీటర్ల కేబుల్ తీగ చోరీ జరిగింది.

గరుడాపురంలో స్టార్టర్ పెట్టెకు అమర్చిన కేబుల్‌ను కత్తిరించారిలా..

● ఇదే విధంగా ఆయా గ్రామాల్లో 10 రోజుల వ్యవధిలోనే దాదాపుగా 25 మంది రైతులకు చెందిన వ్యవసాయ క్షేత్రాల్లో చోరీలు జరిగినట్లు బాధితులు వాపోయారు. చీకటి పండిందంటే చాలు ఎవరి తోటల్లో ఏం మాయం అవుతాయోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యేక నిఘా ఉంచాం..

-గంగాధర, సీఐ, కళ్యాణదుర్గం గ్రామీణం

వ్యవసాయ క్షేత్రాల్లో పలు చోట్ల దొంగతనాలు జరుగుతున్నాయి. బాధితుల నుంచి ఫిర్యాదులు అందాయి. ప్రత్యేక నిఘా ఉంచాం. రాత్రివేళల్లో గస్తీ ఉంచుతాం. మరింత నిఘా పెంచి కట్టడి చేసేలా చర్యలు తీసుకుంటాం.

IN THE COURT OF THE HON'BLE III ADDL. CHIEF JUDICIAL MAGISTRATE :: VIJAYAWADA
C.C. No: 1811 of 2021
M/s. Sumil Chemical Industris (P) Ltd Vs. ... Complainant.
M/s. SRI SAI RAM AGENCIES., Rep. by. Its.Prop. SRI S.ASHOK KUMAR., ... Accused..
NOTICE
As per the Orders of the Hon'ble Court dt.17.7.2026., NBW is pending against Mr.S.ASHOK KUMAR., u/s.138 of NI Act., Section.82 proceedings against you as ordered, Since you are avoiding the court/absconding/concealing yourself, the NBW Cannot be executed. You are hereby ordered to attend the court on **07.10.2026.**, Despite of this publication your absence on the said date will be viewed and declared as Proclaimed Offender and other proceedings will continue against you.
By order and in the name of the III Addl. Chief Judicial Magistrate, Vijayawada.
COUNSEL FOR COMPLAINANT.
UDAYA BHASKARAM.J. ADVOCATE, VIJAYWADA. Mobile No.6302126060

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా క్రింది తెలిపిన షెడ్యూల్డ్ ఆస్తిపై వివాదము కొనసాగుచున్నది. సదరు షెడ్యూల్డ్ ఆస్తిపై గౌ॥ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కళ్యాణదుర్గము O.S.326/2026 దావా దాఖలు అయివున్నది. సదరు దావా భాగపరిష్కార నిమిత్తము కోర్టు యందు విచారణ జరుగుచున్నది. సదరు కోర్టు యందు పై దావాయందు క్రయవిక్రయాలు జరపకూడదని ఇంజంక్షన్ పిటీషన్ కూడా విచారణలో యున్నది. అందువలన ఈ క్రింద తెలిపిన ఆస్తిపై ఎలాంటి క్రయవిక్రయాలు జరపకూడదని ఆ విధంగా జరిపిన క్రయవిక్రయాలు చెల్లనేరవని యావన్మందికి తెలియజేయడం అయినది.
షెడ్యూలు
అనంతపురం రెవెన్యూ డివిజన్, కళ్యాణదుర్గము సబ్‌రెవెన్యూ డివిజన్, గరుడాపురం గ్రామ పొలంలో:

సర్వేనెంబరు	బాబు	విస్తీర్ణము	రిమార్కులు
167-2	G.Dry	Ac.9.18 పైకి	Ac.2.96 సెంట్లు

చెక్కుబంది: తూర్పు: వెలుగు అంజినప్ప భూమి మరియు కొండ, **పడమర:** కుందిర్పి రోడ్డు, **ఉత్తరము:** సర్వేనెంబరు 168, **దక్షిణం:** సర్వే నెంబరు 165.
Y.V.PATTABHI, Advocate
Kalyandurgam. Cell: 9966456562

(c) eenadu

గుంతకల్లు

• గుంతకల్లు • శింగనమల • తాడిపత్రి

గంపమాలయ్యకు విశేష పూజలు

కొండపైన స్వామికి పూలమాలలు వేస్తున్న భక్తులు

శింగనమల, న్యూస్‌టుడే: మండలంలో ప్రసిద్ధి చెందిన గంపమాలయ్య స్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. కొండపై వెలసిన స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పూలమాలలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావంతో కొండ కిక్కిరిసింది. కొన్నేళ్ల క్రితం గుడి పూజారి కాలుజారి కొండ పైనుంచి కిందపడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఆపద వాటిల్లకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.

ఉద్యోగుల్లో స్నేహభావం పెంపునకు క్రీడలు దోహదం

గెలుపొందిన తాడిపత్రి సబ్ డివిజన్ జట్టు

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: క్రీడలు ఉద్యోగుల్లో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తపాలాశాఖ అనంతపురం డివిజన్ సూపరింటెండెంట్ అమర్నాథ్ పేర్కొన్నారు. స్థానిక పీటీసీ మైదానంలో శనివారం తపాలాశాఖ అనంతపురం డివిజన్ ఉద్యోగులకు జరిగిన క్రికెట్ పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు, విజేతలను ఆయన అభినందించారు. అనంతపురం, తాడిపత్రి సబ్ డివిజన్ జట్ల మధ్య జరిగిన 15 ఓవర్ల మ్యాచ్‌లో తొలుత అనంతపురం సబ్ డివిజన్ జట్టు 8 వికెట్ల నష్టానికి 101 పరుగులు సాధించింది. తాడిపత్రి సబ్ డివిజన్ జట్టు 12 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 104 పరుగులతో గెలిచింది తాడిపత్రి జట్టులో బౌలర్ డీసీ వెంకటరాముడు కీలక పాత్ర పోషించారు. ఈయన 3 ఓవర్లకు 21 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టారు. బ్యాటింగ్‌లో మణికంఠ 39 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక సహకారం అందించారు.

తాగునీటి ట్యాంకులో ఇసుక బాగోతం

పునరుద్ధరణకు అధికారుల చర్యలు

ఫిల్టర్‌బెడ్లలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణ సమీపంలోని కసాపురం ఎస్ఎస్ ట్యాంకులో నీటిని శుభ్రం చేయడానికి ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్లలోని ఇసుకను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ప్రస్తుతం వాటిలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతున్న వైనమిది. గుంతకల్లు గ్రామీణ మండలంలోని కసాపురం, నెట్టికంటయ్య ఆలయం, సంగాల, దోసలుడికి గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు 2001లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.5కోట్లు వెచ్చించి ఎస్ఎస్ ట్యాంకు నిర్మించింది. కొద్ది కాలం తర్వాత ట్యాంకులో నీరు నిల్వ ఉండటం లేదని అధికారులు వృథాగా ఉంచారు. ఇదే అదనుగా గుర్తు తెలియని వ్యక్తులు ఫిల్టర్‌బెడ్లలోని ఇసుకను ట్రాక్టర్లలో నింపి తరలించారు. ఇప్పుడు గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు ట్యాంకు పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 4కోట్లు నిధులు విడుదల చేసింది. అవసరమైన ఇసుకను అధికారులు తిరిగి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్యాంకును హంద్రీనీవా నీటితో నింపనున్నారు. ఫిల్టర్ బెడ్లకు మరమ్మతులు చేయనున్నారు.

టెండర్ల ప్రక్రియ చేపట్టారు

మూలనపడ్డ ఎస్ఎస్ ట్యాంకును తిరిగి వినియోగంలోకి తేవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఫిల్టర్ బెడ్లలోని ఇసుకను ఎవరో దొంగిలించారు. ట్యాంకులో నీరు ఇంకిపోకుండా ఉండేందుకు సాంకేతిక నిపుణులు తగు చర్యలు చేపడుతున్నారు. మరమ్మతుల కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులకు సంబంధించి ఉన్నతాధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

-రెహానా వాసిమ్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరం

నార్పల, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాలతో మండల రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు అరుణకుమారి, ఎంపీడీవో మమతాదేవి ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఓటు బదిలీ తదితర అంశాలపై చర్చించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు ఆదివారం వరకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాడిపత్రిలో రూ.77కోట్లతో అభివృద్ధి పనులు

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే: పట్టణ పురపాలికలో అమృత్ 2.0 పథకం కింద రూ.77.35 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్థానిక బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో చేపట్టిన పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ప్రారంభించి మాట్లాడారు. రూ. 16.35 కోట్లతో నందలపాడు నుంచి 4 కి.మీ మేర భూగర్భ మురుగునీటి పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గండికోట నుంచి తాడిపత్రి పురపాలికకు తాగునీరు అందించేందుకు నిలిచిపోయిన అమృత్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి రూ.61 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. పనులను వేగంగా పూర్తిచేయాలని గుత్తేదారులకు సూచించారు. త్వరలోనే పురపాలిక వాసులకు రోజూ తాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మార్కెట్‌యార్డు ఛైర్మన్ భూమా నాగరాగిని, తెదేపా నాయకుడు సూర్యముని, పురపాలిక మాజీ సభ్యులున్నారు.

విష ప్రయోగం కలకలంపై విచారణ

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థిని హర్షిత భోజనం క్యారియర్‌లో కొంతమంది పురుగు మందు కలిపిన ఘటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో శనివారం సీఐ నరేంద్రరెడ్డి, మండల విద్యాధికారులు రాముడు, గురుప్రసాద్ విచారణ చేపట్టారు. విష ప్రయోగం జరిగిందన్న ప్రదేశాన్ని పరిశీలించారు. బాధిత విద్యార్థినితో పాటు పాఠశాల యాజమాన్యంతో వివరాలు సేకరించారు. ఎలా జరిగిందో తెలుసుకొని బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

నెట్టికంటి ఆలయానికి పోటెత్తిన భక్తులు

గజ వాహనంపై సీతారామచంద్రులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, గజ వాహన, ప్రాకారోత్సవ సేవలు వైభవంగా జరిగాయి. శ్రావణ మాసం మూడో శనివారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. బాలాలయంలో స్వామికి రకరకాల అభిషేకాలు చేశారు. రాత్రి గజ వాహన, ప్రాకారోత్సవ సేవలు జరిపారు. గజ వాహనంపై సీతారాములు, ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు నినదించిన జైశ్రీరామ, జైహనుమాన్ నామాలు ప్రతిధ్వనించాయి. స్వామివారి సన్నిధిలో భక్తులు పెద్ద సంఖ్యలో నిద్ర చేయడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఆలయాధికారులు భక్తులకు అన్నదానం చేశారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని ముచ్చుకోట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన మేరకు.. నార్పల మండలం గొల్లపల్లి గ్రామస్థుడు నరసింహులు శనివారం తాడిపత్రికి వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా ముచ్చుకోట సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీని స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పసి ప్రాణానికి బాసట

పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లికి చెందిన ఏడాదిలోపు చిన్నారి ఎస్ఏంఏ వ్యాధితో బాధపడుతున్నాడు. సమాచారం అందుకున్న టెక్ కళాశాలల ఛైర్మన్ రమేష్‌రెడ్డి, అధ్యాపకులు స్పందించారు. బాబు వైద్య చికిత్స నిమిత్తం తమవంతుగా రూ.లక్ష కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, తాడిపత్రి**

బోధనా ప్రమాణాలు మెరుగుపరచండి

శింగనమల, న్యూస్‌టుడే: మండలంలోని పెరవలి జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో ఆయూబ్ హుసెన్ శనివారం సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధనా ప్రమాణాలు పెంచాలని, పిల్లలకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా చెప్పాలని కోరారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అప్‌డేట్ కావాలని సూచించారు. పదో తరగతి పరిక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు నరసింహరాజు, శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడిపై ఇనుపరాడ్లతో దాడి

తాడిపత్రి, న్యూస్‌టుడే: మండలంలోని సజ్జలదిన్నె గ్రామం వద్ద కొంతమంది స్నేహితుడిని కొడుతున్నారని రక్షించేందుకు వెళ్లిన యువకుడిపై దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామీణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు.. పవన్ కుమార్ అనే యువకుడు తన తల్లితో కలిసి ఆలూరు బయలుదేరారు. సజ్జలదిన్నె వద్ద కొందరు అడ్డగించి దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న అతడి మిత్రులు హేమంత్, శుభమన్ అక్కడికి చేరుకొని అడ్డుకునేందుకు యత్నించారు. ఈక్రమంలో దుండగులు హేమంత్‌పై ఇనుపరాడ్లు, రాళ్లతో దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులు రాజేష్, గణేష్, కామేశ్వరరెడ్డి, లక్ష్మీఓబులేసు, అరుణ్, చిన్నా, సుధీర్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో స్వర్ణ పతకం

ఎమ్మెల్యే సోమిరెడ్డితో బంగారు పతకం అందుకుంటున్న రాజేశ్

గుంతకల్లు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పట్టణంలోని సరస్వతి జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ ఇంటర్ విద్యార్థి రాజేశ్ బంగారు పతకం కైవసం చేసుకున్నారు. తిరుపతిలో శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన పతకాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నాడు. తిరుపతిలో 24 నుంచి జరిగిన ప్రభుత్వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో రాజేష్ అండర్-17 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో 10.79 సెకండ్లలో లక్ష్యాన్ని చేరుకొని విజేతగా నిలిచారు. క్రీడా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు ఆయనను అభినందించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పరుగు పోటీల్లో రాణించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ఈయన తండ్రి సురేశ్ గుంతకల్లు పురపాలికలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు.

ఉత్తమ నాయకులకే ఓటు వేయండి

తాడిపత్రి, న్యూస్‌టుడే: పట్టణాభివృద్ధికి పాటుపడే నాయకులనే వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని పురపాలిక మాజీ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎవరైనా డబ్బులు ఇచ్చేందుకు వస్తే నిరాకరించాలన్నారు. రెండు రోజులు యల్లనూరు మండలంలో పర్యటించానని, అక్కడ ప్రజల స్పందన బాగుందని తెలిపారు. గండికోట జలాలు అందుబాటులోకి రావడంతో రైతులకు ఊరట లభించిందని ఆయన వెల్లడించారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

గార్లదిన్నె గ్రామీణం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: గార్లదిన్నె ఆదర్శ పాఠశాల, కళాశాలలో శనివారం దిగ్గజ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనంత రోటరీ క్లబ్ జనరల్ సెక్రటరీ శాంతరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు క్రీడా పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్, వైస్ ప్రిన్సిపల్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామిడి, న్యూస్‌టుడే: స్థానిక టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మల్లికార్జున, మస్తాన్‌వలి మాట్లాడుతూ ఆటలతో నాయకత్వ లక్షణాలు ఎలా పెంపొందుతాయో వివరించారు. అనంతరం గత నాలుగు రోజులుగా జరిపిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

గుంతకల్లు, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీలు శ్రీనివాసప్రసాద్, సురేశ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు జరిపిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు పంచారు.

బుక్కరాయసముద్రంలో కారు దగ్ధం

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రంలోని శిర్డీసాయి కల్యాణమండపం సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో కారు దగ్ధమైంది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు కుటుంబ సభ్యులు అప్రమత్తమై కిందికి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. జమ్మలమడుగుకు చెందిన వెంకటేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో అనంతపురం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. కల్యాణమండపం వద్దకు చేరుకోగానే కారులో మంటలు చెలరేగాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు.

మూడు గ్రామాల తాగునీటి సమస్య తీరింది

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని సిద్ధరాంపురం, దండువారిపల్లి, పసలూరు గ్రామాల్లో 20 ఏళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపిందని ఎంపీడీవో సాల్మన్‌రాజు తెలిపారు. ఆయన శనివారం విలేకరులకు వివరాలు తెలిపారు. ఎమ్మెల్యే శ్రావణిశ్రీ చొరవతో సిద్ధరాంపురం గ్రామానికి రూ.17 లక్షలు నిధులు కేటాయించి బోరు, పైపులైను ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. సత్యసాయి తాగునీటి పథకం నుంచి రూ.18 లక్షల వ్యయంతో కొత్త పైపులైను వేసి ట్యాంకులకు నీరు సరఫరా చేసి దండువారిపల్లి, పసలూరుకు అందిస్తున్నట్లు వివరించారు. గ్రామస్థులు తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు.

గిడుగు బాట..తెలుగు మాట

• తెలుగు భాషా దినోత్సవంలో వక్తలు

గుంతకల్లు: గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

గుంతకల్లు పట్టణం: తెలుగు సంప్రదాయం ఉట్టిపడే దుస్తులు ధరించిన విద్యార్థినులు

తాడిపత్రి: సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకుడు

గుంతకల్లు, న్యూస్‌టుడే: కమ్మనైన తెలుగు భాషను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి తెలుగువాడిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు లక్ష్మయ్య, అధ్యాపకులు రవిశంకర్ శర్మ, హనుమంతరెడ్డి, పరేశ్, వనజమ్మ తదితరులు తెలిపారు. స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమకారుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి పురస్కరించుకొని శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు మాతృభాష తీయదనాన్ని ఉగ్గుపాలతో రంగరించాలన్నారు. తొలుత గిడుగు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతం తెలుగు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, భాష్యం పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

గుంతకల్లు పట్టణం: పట్టణంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మంజునాథ్, కరస్పాండెంట్ ఓంకారప్ప గిడుగు బాటలో తెలుగు మాట అందరి నోటా ఎలా పలుకుతుందో వివరించారు. విద్యార్థినులు తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే వస్త్ర ధారణతో మా తెలుగుతల్లికి మల్లెపూదండ గేయాన్ని ఆలపించి ఆకట్టుకున్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. సాధారణ జనాలకు అర్థమయ్యేలా తెలుగు భాష నడకను గిడుగు రామమూర్తి పంతులు ఎలా మార్చారో విద్యార్థులకు వివరించారు. వీరన్నపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో తెలుగు పద్యాలు, పలు క్రీడల్లో పోటీలు జరిపి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

తాడిపత్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని జరిపారు. గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి అధ్యాపకులు పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సత్యనారాయణ, తెలుగు అధ్యాపకుడు విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులకు పెద్దపీట

శింగనమల, న్యూస్‌టుడే: మండల పరిధి బండమీదపల్లిలోని స్వర్ణభూమి ఫర్టిలైజర్స్, ఆర్గానిక్ ఎరువుల తయారీ కర్మాగారాన్ని శనివారం వ్యవసాయ సంచాలకులు సాలు రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు, ప్రయోగశాలను పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, తయారుచేసిన ఎరువుల వివరాలను క్రమం తప్పకుండా తమ దృష్టికి తేవాలన్నారు. ఎరువుల నమునాలు తీసి ల్యాబ్‌కు పంపాలని ఏవోను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు వంశీ, రాకేష్ నాయక్, అన్వేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27న గుత్తి కోట చరిత్రపై వ్యాసరచన పోటీలు

గుత్తి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, యువతకు గుత్తి కోట చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ తెలిపారు. ఆయన శనివారం పోటీలకు సంబంధించిన గోడపత్రాలను కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా విడుదల చేసినట్లు తెలిపారు. కోట చరిత్రపై అవగాహన పెంచేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు.

విత్తన సామగ్రిని అందుబాటులో ఉంచాలి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మహిళా రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యను విస్తరించడంతో పాటు గ్రామాలకు అవసరమైన విత్తన, ఎరువులు, ఇతర సామగ్రిని అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సమాఖ్య సభ్యులు కోరారు. శనివారం మహిళా రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం వార్షికోత్సవాన్ని స్థానిక షాదీఖాన్ ఆవరణలో నిర్వహించారు. ఎస్‌బీఐ మేనేజరు నాగార్జునరెడ్డి, కోరమాండల్ కంపెనీ నిర్వాహకులు హరికృష్ణ, ఏపీమాస్ ప్రతినిధులు లక్ష్మీదేవి, సోమశేఖర, అనిల్, మహేశ్వరి, అనిత తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ ఆర్థిక ఏడాదిలో సమాఖ్య రూ.1.6కోట్ల విలువైన ఎరువులు, విత్తనాల వ్యాపారం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సమాఖ్య కొత్త డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

తేనెటీగల పెంపకంతో రైతులకు ఆదాయం

అనంతపురం వ్యవసాయం, న్యూస్‌టుడే: తేనెటీగల పెంపకం రైతులకు ఆదాయ వనరు అని నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మంజునాథ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సిండికేట్ నగర్ నల్లమల హనీ కేంద్రం వద్ద తేనెటీగల పెంపకంపై రైతులకు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. శాస్త్రవేత్త మంజునాథ్, జిల్లా ఉద్యానశాఖ ఉపసంచాలకులు ఉమాదేవి మాట్లాడుతూ తేనెటీగల పెంపకం కోసం పెట్టెలు ఏర్పాటు చేసుకునేందుకు నలభై శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఔత్సాహిక రైతులకు యూనిట్‌కు రూ.10 లక్షల వరకు మంజూరు చేస్తామన్నారు. అనంతరం తేనెటీగల పెంపకంపై శిక్షకులు రమేశ్ రైతులకు అవగాహన కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

సమస్య: సాయినగర్ రెండో క్రాస్‌లో నెల రోజులుగా వీధిలైటు వెలగడం లేదు. - **అర్జున్**
సమాధానం: సాంకేతిక సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం.
సమస్య: ఎన్టీఆర్ మార్గ్‌లో విభాగినుల మధ్యలో అనధికారికంగా దారి ఏర్పాటు చేసుకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - **నరేష్**
సమాధానం: వెంటనే మూసివేస్తాం.
(పై ప్రశ్నలకు నగరపాలక ఈఈ షాకీర్, డీఈ దాక్షాయిణి సమాధానాలు ఇచ్చారు)
– న్యూస్‌టుడే, అశోక్‌నగర్

ప్రభుత్వ బడి.. భద్రత కొరవడి

ప్రహరీలు లేక భయాందోళనలో విద్యార్థులు

మన్నీలా గ్రామంలో కూలిపోయిన గోడ

రాప్తాడు, ఆత్మకూరు, న్యూస్‌టుడే: రాప్తాడు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేవు. దీంతో ఆవరణల్లోని మొక్కలకు, సామగ్రికి రక్షణ లేకుండాపోతుంది. పశువులు, విషకీటకాలు లోపలికి వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో పాఠశాలల గోడలు కూలిపోయాయి. అప్పట్లో పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. రహదారుల పక్కనే ఉన్న పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

ప్రహరీ లేని ఆదర్శ పాఠశాల

అసాంఘికాలకు అడ్డాగా..

- రాత్రివేళ మద్యం బాబులకు పాఠశాలలు అడ్డాలుగా మారుతున్నాయి.
- సెలవులు, రాత్రివేళ గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలల్లోని సామగ్రి ధ్వంసం చేసే ప్రమాదం ఉంది.
- ఇటీవల ఓ ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో బయట వ్యక్తి వచ్చి విద్యార్థిని తీసుకొని వెళ్లడం కలకలం రేపింది.

సమస్య ఎక్కడెక్కడంటే..

- రాప్తాడు మండలం పంగల్‌రోడ్డులోని మోడల్ స్కూల్లో 480 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలకు ప్రహరీ లేక చుట్టూ కంపచెట్లు పెరిగిపోయాయి. పిల్లలు ఆటలు ఆడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు.
- అనంతపురం రూరల్ మన్నీలా గ్రామంలో జిల్లా పరిషత్తు పాఠశాల గోడ పడిపోయింది. పక్కనే ఉన్న ముళ్లపొదల్లో నుంచి విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.
- రాప్తాడు మండలం చెర్లోపల్లి గ్రామంలో రహదారి పక్కనే ఉన్న పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- రాప్తాడు మండలం బుక్కచెర్ల, గొల్లపల్లి పాఠశాలల్లోనూ సమస్య ఉంది.
- ఆత్మకూరు మండలం బి.యాలేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీ పలుచోట్ల దెబ్బతినడంతో మందుబాబులు రాత్రివేళల్లో లోపలికి వచ్చి మద్యం తాగుతున్నారు.
- ఆత్మకూరు మండలం తలుపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీ దెబ్బతిని ఎనిమిదేళ్లవుతోంది. మరమ్మతులకు అధికారులు విన్నవిస్తున్నా ఫలితం శూన్యం. పశువులు లోపలికి వచ్చి అపరిశుభ్రం చేస్తున్నాయి.
- ఆత్మకూరు మండలం సనప ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని మధ్యలో వదిలేశారు. దీంతో ఇనుపచువ్వలు ప్రమాదకరంగా మారాయి.

విద్యార్థుల హక్కుల సాధనకు సమరశీల ఉద్యమం

ప్రసంగిస్తున్న ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐషిఘోష్

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థను ప్రైవేటీకరిస్తూ, ప్రశ్నించే విద్యార్థులను అణచివేయడానికి ప్రయత్నిస్తే సమరశీల ఉద్యమాలు చేపడతామని ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐషిఘోష్ హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్లో 'జన్ జడ్ మీట్' బహిరంగ సభ నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై సభలో ప్రసంగించారు. ఇటీవల దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్న ఆమె తన అనుభవాలు వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని రోడ్లపై వచ్చిన ఈ తరం విద్యార్థుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అధికార పీఠంపై కూర్చున్న నిరంకుశ పాలకుల బలం కంటే వీధుల్లో నిలబడిన ప్రజల ఐక్యశక్తి గొప్పదని నిరూపించామన్నారు. 12 సంవత్సరాలుగా దేశంలో పాలకుల వినాశకర విధానాల వల్ల కుమిలిపోతున్న యువత ఆక్రోశానికి ప్రతిరూపం ఆ ఉద్యమమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం తగదన్నారు. 37 రోజుల సుదీర్ఘ పోరాటానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని గుర్తు చేశారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటానికి వెనుకాడమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్, ప్రసన్నకుమార్, పరమేష్, గిరి, రవి, నాగార్జున, బంగిశివ పాల్గొన్నారు.

హాజరైన విద్యార్థులు

అర్ధరాత్రి రెండు కార్లు ఢీ

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

అనంతపురం, న్యూస్‌టుడే: నగరంలోని శారదనగర్ వద్దనున్న సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ కళాశాల ఎదుట శనివారం అర్ధరాత్రి కారును మరో కారు వెనుక నుంచి ఢీకొంది. స్థానికుల వివరాల మేరకు.. ఒక కారు అతివేగంగా వచ్చి వేగనిరోధకాల వద్ద మలుపు తిరుగుతున్న కారును ఢీకొని, డివైడర్ మధ్యలో నుంచి ఇనుప గ్రిల్స్‌ను ధ్వంసం చేసుకొని రోడ్డు అవతల వైపునకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. రెండు కార్లలో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు. ప్రమాద సమయంలో కాసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది.

విద్యుత్తు స్తంభాలు సరి చేశారు

హౌసింగ్‌బోర్డుకాలనీ(అనంతపురం): నగరంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ సమీపంలోని హమాలీ కాలనీ ఒకటో వీధిలో నివాసాల నడుమ అమర్చిన విద్యుత్తు స్తంభం రోడ్డుకు ఓవైపు వాలిపోయింది. తీగలు ఇళ్లకు తగులుతున్నాయి. సమస్యపై జులై 27న 'ఈనాడు'లో 'ఒరిగిన విద్యుత్తు స్తంభంతో భయాందోళన' శీర్షికన చిత్ర వార్త ప్రచురితమైంది. స్థానిక విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి స్తంభాలను సరిచేసి, తీగలనుపైకి అమర్చారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు'

అనంతపురం రాంనగర్, న్యూస్‌టుడే: ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్న మాజీ మేయర్ వసీం వ్యాఖ్యలను ఎవరూ నమ్మలేని పరిస్థితి ఉందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. శనివారం అర్బన్ తెదేపా కార్యాలయంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, తెదేపా నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహులు మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఒకేరోజు రూ.6.84 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, వైకాపా నాయకులకు కళ్లు కుట్టాయా అని ఎద్దేవా చేశారు. వసీం అధికారంలో ఉండగా ఏరోజైనా నగరాభివృద్ధి గురించి పట్టించుకున్నారా అని నిలదీశారు. ఎమ్మెల్యే అభివృద్ధికి పాటుపడుతుంటే నిత్యం బురద జల్లుతూనే ఉన్నారని మండిపడ్డారు.

వీధి వ్యాపారులకు స్మార్ట్‌బజార్ అండ

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కమిషనర్ జస్వంతరావు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలోని వీధి వ్యాపారులకు స్మార్ట్ బజార్ ఆర్థికంగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కళ్యాణదుర్గం రోడ్డు బైపాస్ వద్ద రూ.4.50 కోట్లతో స్మార్ట్‌బజార్ కంటైనర్ల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అదేవిధంగా లక్ష్మీనగర్‌లో రూ.16 లక్షలతో సిమెంటు రోడ్డు, రాణినగర్‌లో రూ.37 లక్షలతో సీసీ రోడ్డు, హిందూ శ్మశానవాటికలో రూ.32 లక్షలతో అభివృద్ధి పనులు, ఎస్‌బీఐ కాలనీలో రూ.20 లక్షలతో మురుగు కాలువ నిర్మాణం, హమాలీ కాలనీలో రూ.54 లక్షలతో సీసీ రోడ్డు, రాజీవ్ చిల్డ్రన్స్ పార్కు వద్ద రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఖాజానగర్‌లో రూ.15 లక్షలతో నిర్మాణం పూర్తయిన రక్షణ గోడను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కమిషనరు జస్వంతరావు, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ షాకీర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో స్నేహభావం పెంపునకు క్రీడలు దోహదం

గెలుపొందిన తాడిపత్రి సబ్ డివిజన్ జట్టు

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: క్రీడలు ఉద్యోగుల్లో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తపాలాశాఖ అనంతపురం డివిజన్ సూపరింటెండెంట్ అమర్నాథ్ పేర్కొన్నారు. స్థానిక పీటీసీ మైదానంలో శనివారం తపాలాశాఖ అనంతపురం డివిజన్ ఉద్యోగులకు జరిగిన క్రికెట్ పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు, విజేతలను ఆయన అభినందించారు. అనంతపురం, తాడిపత్రి సబ్ డివిజన్ జట్ల మధ్య జరిగిన 15 ఓవర్ల మ్యాచ్‌లో తొలుత అనంతపురం సబ్ డివిజన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లకు 8 వికెట్ల నష్టానికి 101 పరుగులు సాధించింది. తాడిపత్రి సబ్ డివిజన్ జట్టు కేవలం 12 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 104 పరుగులతో ఘన విజయం కైవసం చేసుకుంది. తాడిపత్రి జట్టులో బౌలర్ డీసీ వెంకటరాముడు కీలక పాత్ర పోషించారు. ఈయన 3 ఓవర్లకు 21 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టారు. బ్యాటింగ్‌లో మణికంఠ 39 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక సహకారం అందించారు.

శంకుస్థాపనతోనే సరి..

అనంతపురంలోని మరువ వంకకు సమాంతరంగా త్రివేణి వద్ద వంతెన ప్రమాదకరంగా మారింది. తాడిపత్రి, గుత్తివైపు వాహనాలన్నీ ఇటుగా వెళ్లాల్సి ఉంటుంది. 2019 అమృత్ నిధులతో వంతెన నిర్మాణానికి భూమిపూజ చేసి వదిలేశారు. ప్రస్తుతం పనులు చేపట్టి పూర్తి చేయాలంటే రూ.2 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.
- న్యూస్‌టుడే, అనంతపురం (అశోక్‌నగర్)

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

అనంతపురం (రాంనగర్), న్యూస్‌టుడే: అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 10 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద రూ.14,01,495 విలువైన చెక్కులు మంజూరయ్యాయి. వీటిని శనివారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తన క్యాంప్ కార్యాలయంలో బాధితులకు పంపిణీ చేశారు.

ఆలయాలకు శ్రావణశోభ

పూజలందుకున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడు

అనంత సాంస్కృతికం: శ్రావణమాసం శనివారం సందర్భంగా నగరంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బెంగళూరు రోడ్డు శివబాలయోగి ఆశ్రమంలో భక్తులు శ్రీనివాసుడికి సుగంధ ద్రవ్యాల గంగాభిషేకం, పంచామృతాభిషేకం, తులసి దళాలతో అర్చన, లడ్డుపడి జరిపించారు. ఆర్ఎఫ్ రోడ్డు, హౌసింగ్‌బోర్డు, రాంనగర్ లక్ష్మీవేంకటేశ్వరాలయాల్లో మూలమూర్తులకు విస్తృత స్థాయిలో తులసిదళాలతో పూజలు చేశారు. కోర్టు రోడ్డు వరదాంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ చేశారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

జేఎన్‌టీయూలో గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీసీ సుదర్శనరావు, ఆచార్యులు

ఆర్ట్స్ కళాశాలలో విశ్రాంత అధ్యాపకుడు నారాయణకు సన్మానం, బహుమతులు అందుకున్న విద్యార్థులు

తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలేస్తున్న ఎస్ఎస్‌బీఎన్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: నగరంలోని పలు విద్యాలయాల్లో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జేఎన్‌టీయూలో గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి వీసీ ఆచార్య సుదర్శనరావు పూలమాలలేసి నివాళి అర్పించారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, భాషాభిమానులు ర్యాలీ నిర్వహించారు. తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు నారాయణను సన్మానించారు. కోర్టురోడ్డులోని శ్రీచైతన్య, గాయత్రి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చిన్నారులు తెలుగు కవులు, దేశనాయకుల వేషధారణలతో అలరించారు. భాష్యం పాఠశాలలో ప్రిన్సిపల్ బాలకృష్ణ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రుద్రంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

శ్రీచైతన్య పాఠశాలలో కవులు, దేశనాయకుల వేషధారణలో చిన్నారులు

రుద్రంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో..

ఆత్మకూరు: దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలుగు ఉపాధ్యాయుడు రామాంజనేయులు పేర్కొన్నారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాతల చిత్రాలను అందజేశారు.

అనంత నగరపాలక: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వెంకట్ నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కమ్మన్న, పాఠకులు పాల్గొన్నారు.

బయోమైనింగ్ మాటలకే పరిమితమా?

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి బయోమైనింగ్ మాటలకే పరిమితం అయిందని మాజీ మేయర్ వసీం విమర్శించారు. శనివారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఆయన పలువురు మాజీ కార్పొరేటర్లతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డంపింగ్ యార్డును పూర్తిగా తరలిస్తామని చెప్పిన ఎమ్మెల్యే మొదట చెత్తను పూర్తిగా బయోమైనింగ్ చేయాలన్నారు. నగరంలో ఎక్కడ చూసినా సమస్యలు ఉన్నాయని, పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే బాగోతంపై ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మాట్లాడిన మాటలకు ఎందుకు సమాధానం చెప్పలేదని నిలదీశారు.

మహిళను కుటుంబసభ్యులకు అప్పగింత

అనంతపురం(మూడోరోడ్డు), న్యూస్‌టుడే: ఇంట్లో చెప్పకుండా ముంబయి నుంచి బెంగళూరు వెళుతున్న మహిళను రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) పోలీసులు గుర్తించి, కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆర్పీఎఫ్ సీఐ సుధాకర్‌రావు తెలిపిన వివరాల మేరకు.. ముంబయికి చెందిన మహిళ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. బెంగళూరు వెళ్లడానికి జనరల్ టికెట్ కొనుగోలు చేసి రైలు ఎక్కింది. ఈ విషయాన్ని తెలుసుకున్న మహిళ సోదరుడు మహేష్ అనంతపురం ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ముంబయి నుంచి బెంగళూరు వెళుతున్న 11301 ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ బోగీలను శనివారం తెల్లవారుజామున పరిశీలించారు. అందులో మహిళను గుర్తించి, స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత బంధువులకు అప్పగించారు.

చేతివృత్తిదారులను ఆదుకోవాలని ధర్నా

నిరసన తెలుపుతున్న చేతివృత్తిదారులు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: సమాజంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని చేతివృత్తిదారులను ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. చేతి వృత్తిదారులు సొంతకాళ్లపై నిలబడి పలు రకాల పనులు చేసుకుంటున్నారు. వీరికి ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం అందడం లేదని ఆరోపించారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి రుణాలు విరివిగా ఇవ్వాలన్నారు. 50ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి సామాజిక పింఛన్ ఇవ్వాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో సీట్లు కేటాయించాలన్నారు. ప్రతి వృత్తిదారుడికి తగిన రీతిలో ఆదుకోవాలన్నారు. ఈ నిరసనలో జిల్లా కార్యదర్శి హరికృష్ణ, అధ్యక్షుడు నాగప్ప, విశ్వబ్రాహ్మణ సంఘం లక్ష్మీనారాయణ ఆచారి, నాయీ బ్రాహ్మణ సంఘం గోవిందరాజులు, కుమ్మర శాలివాహన గాది లింగప్ప, పూసల సంఘం హనుమంతు, రజక బాల వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

డీఈవో అయూబ్‌హుస్సేన్‌తో అవార్డులు అందుకున్న వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్‌లో రాణిస్తున్న విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని డీఈవో అయూబ్ హుస్సేన్ పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 5 పాఠశాలలు స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డులకు ఎంపికయ్యాయి. నూతిమడుగు, తలారిచెరువు, కొనకొండ్ల, ఉరవకొండ, పాల్తూరులోని ఉన్నత పాఠశాలలు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. జాతీయక్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో డీఈవో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారులు శ్రీనివాసరావు, లక్ష్మన్న, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శకుంతల, నరసింహారెడ్డి, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాఘవుడి ఆరాధనోత్సవాలు

ప్రత్యేక అలంకారంలో రాఘవేంద్రుడు

అనంత సాంస్కృతికం: నగరంలోని మొదటిరోడ్డు రాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. మొదటిరోజు అష్టోత్తర పారాయణం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పాదపూజ అనంతరం తులసి అర్చన, హస్తోదకం జరిగింది. రాత్రి స్వామికి రథోత్సవం నిర్వహించారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరుగుతున్న ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి జరిగిన పూర్వారాధనకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమాలను మేనేజరు రామకోటేశ్వరరావు, మఠం సిబ్బంది పర్యవేక్షించారు.

యువతి అదృశ్యం

అనంత నేరవార్తలు: నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండో రోడ్డుకు చెందిన యువతి శనివారం అదృశ్యమైంది. గుత్తి పట్టణ ప్రాంతానికి చెందిన సదరు యువతి గత నెల రోజులుగా ఆమె అక్క వద్ద ఉంటోంది. శనివారం ఉన్నఫళంగా ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత

అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బోసిపోయిన స్టాంపుల విక్రయ కౌంటర్

అనంత గ్రామీణం(తపోవనం), న్యూస్‌టుడే: అనంతపురం అర్బన్, గ్రామీణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్-జ్యుడీషియల్ స్టాంపుల కొరత మళ్లీ తీవ్రమైంది. అన్ని రకాల స్టాంపు కాగితాలు లభ్యం కాకపోవడంతో సమస్య జఠిలమైంది. ఉమ్మడి జిల్లాలో రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపు కాగితాలు ఎక్కువగా విక్రయిస్తారు. కొన్ని కార్యాలయాల్లో ఉన్న నిల్వలను అప్పుడప్పుడు సర్దుబాటు చేస్తుంటారు. ఈ రెండు కార్యాలయాలకు సర్దుబాటు కాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రభుత్వ ఖజానాకు కామధేనువుగా ఉన్నా.. స్టాంపుల కొరత తీర్చడంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత రెండురోజుల నుంచి స్టాంపుల అమ్మకం పూర్తిగా ఆగింది. ఈ-స్టాంపులు ఉన్నా ప్రజలు నాన్ జ్యుడీషియల్ స్టాంపులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. అనేక రకాల ఒప్పంద పత్రాలకు, ఆస్తుల రిజిస్ట్రేషన్లకు ఎంతో కీలమైన రూ.50, 100 విలువైన స్టాంపుల నిల్వలు పూర్తిగా అయిపోయాయి. రూ.20, 10 విలువ స్టాంపులు కూడా లభ్యం కాలేదు.

నాసిక్ నుంచి దిగుమతి చేసుకోవాలి

ఏ రకమైన స్టాంపులైనా మహారాష్ట్రలోని నాసిక్‌లో ముద్రిస్తారు. ప్రభుత్వం ముందే బయానా చెల్లిస్తే ముద్రించి పంపుతారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతిసారి జిల్లాకు సుమారు రూ.4 కోట్ల నుంచి రూ.10 కోట్ల విలువైన స్టాంపులు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. వీటిని జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు డిమాండ్‌ను బట్టి సరఫరా చేస్తారు. ప్రస్తుతం అనంతపురం అర్బన్, గ్రామీణంలో కలిపి రోజుకు 100 నుంచి 150 వరకు రిజిస్ట్రేషన్లు నమోదవుతాయి. ఆస్తుల తనఖాకు కూడా ఈ స్టాంపులు అవసరం. ఈ-స్టాంపులు ఏజెన్సీల వద్ద లభిస్తున్నా.. వాటి కొనుగోలు మందగించింది. అక్కడక్కడ వెండర్ల దగ్గర లభ్యమవుతున్నా అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో నేరుగా నాసిక్ నుంచి కొనుగోలు చేస్తే ఇబ్బందులు తప్పుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. గత మూడు రోజుల నుంచి స్టాంపుల కొరత ఉందని, త్వరలో తెప్పించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని అర్బన్ సబ్ రిజిస్ట్రార్ హేమలత వివరించారు.

క్రీడలు విద్యార్థుల జీవితంలో భాగం కావాలి

ఆర్ట్స్ కళాశాలలో నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపల్ పద్మశ్రీ తదితరులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల జీవితంలో భాగం కావాలని ఎస్కేయూ వీసీ ఆచార్య జ్యోతికుమార్ పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగాధిపతి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు. ● ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ పద్మశ్రీ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు.

లెనిన్‌నగర్(అనంతపురం): అనంత గ్రామీణం పరిధిలోని చియ్యేడు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు క్రీడా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం విశ్వనాథ్, పీడీ వేణుగోపాల్ మాట్లాడారు. జులై 31న నిర్వహించిన అనంత స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ ఖోఖో, హాకీ, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్, శశికళ, నలనాక్షి, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

చియ్యేడు ఉన్నత పాఠశాలలో..

ఉత్సాహంగా చిన్నారుల పోటీలు

చిన్నారికి బహుమతి అందజేస్తున్న ఎస్పీ జగదీశ్

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు చదువుతో పాటు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. 'నేషనల్ స్పోర్ట్స్ డే' ను పురస్కరించుకుని 28, 29 తేదీల్లో జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని రక్షక్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల ముగింపు వేడుకలు శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. చిన్నారులు వివిధ ఆటల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు ఎస్పీ సర్టిఫికెట్లు, పతకాలు, బహుమతులు అందజేసి అభినందించారు.

(c) eenadu